epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:344

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 17.07.2026 శుక్రవారం, హైదరాబాద్

## నీట్ యూజీ ఫలితాలు విడుదల



- అమ్మాయిలదే పైచేయి
- 19 మంది విద్యార్థులు 720 మార్కులకుగానూ 700 మార్కులు
- 1492 మంది స్టూడెంట్స్ 650పైగా మార్కులు
- 20 లక్షలకుపైగా విద్యార్థులు పరీక్ష రాయగా
- అందులో 11.21 మంది అడ్మిషన్లకు అర్హత సాధించారు

2లో

‘కేసీఆర్ హయాంలో గత పదేళ్లపాటు రాష్ట్రంలో ప్రాజెక్టుల పేరుతో ధన దోపిడీ జరిగింది. వేల కోట్లు లూటీ చేశా రు. కాళేశ్వరం, కూలేశ్వరమైంది. సీతారామ ప్రాజెక్టు రీ డిజైన్ పేరుతో భారీ దోపిడీ జరిగింది’ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. గురువా రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బరాజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలు వలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్య వస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన ప నులు, మిగిలిన పనులు, అవసరమైన నిధు లు తదితర అంశాలను మంత్రులకు వివరించారు.



### కేసీఆర్ పాలనలో ప్రాజెక్టుల పేరుతో

# ధన దోపిడీ

### రీ డిజైన్ల పేరిట వేల కోట్ల లూటీ

- పైసా వృథా కాకుండా సీతారామ పూర్తి
- చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం
- గోదావరి జలాలపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక..
- డిప్యూటీ సీఎం భట్టి
- ప్రాణహితకు మళ్లీ ప్రాణం
- నిపుణుల సూచనలతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ ...
- మంత్రి ఉత్తమ్
- డిజైన్ల మార్పుల పేరుతో కాలయాపన చేయం..
- మంత్రి పొంగులేటి
- భద్రాద్రి జిల్లాలో సీతారామ ప్రాజెక్టు సందర్శన

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
సమక్ష సమావేశంతో పాటు అనంత రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల రీడిజైన్ల పేరిట దోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు. ‘గతంలో వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో రుద్రంకోట వద్ద ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టుల ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అప్పటికే 60 శాతం పనులు పూ ర్తయ్యాయి.
ఈపీసీ విధానం ద్వారా మిగిలిన రూ. 1,500 కోట్లు ఖర్చు పెట్టి ఉంటే ఈపాటికే ఆ భూములకు నీళ్లు పారేవి‘ అని గుర్తుచేశారు. కానీ, గత బిఆ ర్ఎస్ ప్రభుత్వం కేవలం అంచనాలను పెంచి దోపిడీ చేయడానికే ఆ ప్రాజెక్టులను ‘సీతారామ ప్రాజెక్టు’గా రీడిజైన్ చేసి, సీతమ్మ సాగర్ బ్యారే జీతో కలుపుకొని అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.24 వేల కోట్లకు పెంచిందని ఆరోపించారు. పదే ళ్ల కాలంలో రూ.7,500 కోట్లకు పైగా ప్రజా ధనాన్ని వృథా చేస్తూ దోపిడీకి తెరలేపారు’ అని ఆరోపించారు.
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ, సీతారామ ।మిగతా 2 లో।



## కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

- అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వం
- వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు
- కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుదాం
- రేపు సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు
- సభకు అడ్డంకులు సృష్టించే అవకాశం
- సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులసమావేశంలో కేటీఆర్

2లో



## పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

- ఒకరు మృతి, అనేక మందికి గాయాలు
- మరీచకోట్‌కు చేరువలో ఘటన
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- భగవంతుని దర్శనం కోసం పూరీకి చేరుకున్న 2 లక్షల మంది భక్తులు


2లో



## వాంగ్‌చుక్‌ను విద్యాశాఖ మంత్రి చేయండి

- పీఎం మోదీకి మాజీ సీఎం కేజ్రీవాల్ సూచన
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలి
- ప్రతి ఏడాది పరీక్షా ప్రశ్నా పత్రాలు లీక్ అవుతున్నాయి
- లీక్ మూల్యం దేశ యువత చెల్లిస్తోంది
- యువతను కేంద్రం పట్టించుకోవట్లేదు..
- వచ్చే ఎన్నికల్లో యువతరం సత్తా చూపిస్తారు.
- వాంగ్‌చుక్ దీక్ష విరమించాలని కాంగ్రెస్ విజ్ఞప్తి
- వాంగ్‌చుక్‌కు కాంగ్రెస్,సమాజ్‌వాదీ పార్టీల మద్దతు

2లో



## పశ్చిమాసియాలో యుద్ధం ఉధృతం

2లో

- ఇరాన్‌లో అమెరికా భీకర దాడులు
- హోర్ముజ్ జలసంధిలో టెహ్రాన్ నౌకపై దాడి
- బాలిస్టిక్ క్షిపణి ఉత్పత్తి,సెమ్నాన్ ప్రావిన్స్ కేంద్రాలపై గురి
- టెహ్రాన్ ఆస్పత్రి సమీపంలో అమెరికా క్షిపణి దాడి
- ప్రతీకారంగా జోర్డాన్, కువైట్‌పై టెహ్రాన్ క్షిపణులు, డ్రోన్ల ప్రయోగం
- అమెరికా సైనికుల్ని కిడ్నాప్ చేయండి...ఇరాన్ మాజీ మంత్రి
- ఉక్కు పిడిగుద్దులతో నుజ్జునుజ్జు చేస్తాం: ఇరాన్
- ట్రంప్‌ను అంతం చేస్తామని టెహ్రాన్‌లో భారీ హోర్డింగ్



## వైభవంగా గోల్కొండ బోనాలు

- జగదాంబమ్మకు తొలి బోనం సమర్పణ
- పట్టువస్త్రాలు అందజేసిన మంత్రులు
- కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ సందర్శకులతో కిటకిటలాడిన గోల్కొండ కోట పరిసరాలు
- అలరించిన పోతరాజుల విన్యాసాలు
- రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి
- తెలంగాణను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- మంత్రి కొండా సురేఖ

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
తెలంగాణ జీవన వైవిధ్యానికి, భక్తికి, ఐక్యతకు ప్రతీక అయిన ఆషాఢం బోనాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని గోల్కొండ జగదాంబమ్మకు తొలి బోనం సమర్పించారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా లంగర్‌హౌస్ నుంచి పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబ మహంకాళి (ఎల్లమ్మ) అమ్మవారికి మంత్రులు పట్టువస్త్రాలు, బంగారు బోనాన్ని సమర్పించారు. ప్రభుత్వ సలహాదారు వి .హనుమంతరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, మాజీ గవ ర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ఆలయ చైర్మెన్ ఆకుల చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.
తొలి (బంగారు) బోనం ।మిగతా 2 లో।

## కేసీఆర్ పాలనలో ప్రాజెక్టుల పేరుతో
# ధన దోపిడీ

**తరువాయి భాగం**

ప్రాజెక్టును సాధ్యమైనంత అర్థవంతంగా మరింత అర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు. 'రాజీవ్ కెనాల్ లింక్ కోసం రూ. 100 కోట్లు మంజూరు చేసి ఎస్ఎల్బీసీ కెనాల్, వైరా రిజర్వాయర్లకు అనుసంధానిస్తున్నారు. పాలేరు రిజర్వాయర్‌కు వెళ్లే జూలూరుపాడు టన్నెల్ పనులను వేగవంతం చేసి, మున్నేరు నదిని లింక్ చేయడం ద్వారా పాలేరు, వైరా, లంకా సాగర్ రిజర్వాయర్లను నింపనున్నామని చెప్పారు. దీనివల్ల సత్తుపల్లి, పరిసర ప్రాంతాల రైతులకు త్వరగా సాగు నీరందిస్తాం' అని వివరించారు. ఈ ప్రాజెక్టు పనుల కోసం ఇప్పటికే రూ. వెయ్యి కోట్ల బిల్లులను విడుదల చేసిందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (టన్నెల్) పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని గ్రావిటీ, లిఫ్ట్ ద్వారా గరిష్ఠంగా వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ముందుకు వెళుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

అంతర్జాతీయంగా వస్తున్న వాతావరణ మార్పులు, విపత్కర పరిస్థితులను తట్టుకునేలా ముందే ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోందన్నారు. మూడు రోజులు క్రితం దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సమ్మక్క బ్యారేజ్ బ్యాక్ వాటర్ నుంచి నీటిని పూర్తి స్థాయిలో లిఫ్ట్ చేయడం కోసం అన్ని పంపులను ఆన్ చేయడమే కాకుండా, అక్కడ ఉన్న దాదాపు 12 జిల్లాల్లో, 17 నియోజకవర్గాలు, 22 రిజర్వాయర్లను నింపే కార్యక్రమానికి స్వయంగా అక్కడే ఉండి రివ్యూ నిర్వహించినట్లు తెలిపారు.

తెలంగాణ ప్రాంతంలో గోదావరి నదిపై ఉన్న ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, కోరం కనకయ్య, గ్రంథాలయ శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ దివాకర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ హాజరయ్యారు.

**కాలయాపన చేయం: మంత్రి పొంగులేటి**

సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. డిజైన్ మార్పుల పేరుతో కాలయాపన చేసే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. ఈ కరువు కాలంలో కూడా ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేసి రైతులకు అండగా నిలిచామని ఆయన వివరించారు. రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయమన్నారు. సమీక్షలో సీతారామ భూసేకరణ పనుల కోసం వెంటనే 135 కోట్ల రూపాయలను విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేసి వెంటనే ట్రెజరీకి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.

**ప్రాణహితకు మళ్లీ ప్రాణం: మంత్రి ఉత్తమ్**

తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి రంగంలో చారిత్రాత్మక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి రైతులకు సాగు నీరందిస్తామని ఆయన ప్రకటించారు.

దివంగత మాజీ సీఎం వైఎస్ఆర్ ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండానే పనులను ప్రారంభించడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రభుత్వం బలంగా పోరాడుతోందని, అవసరమైన అన్ని కేంద్ర అనుమతులను సాధించి చట్టబద్ధంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి సాగుభూమికి గోదావరి జలాలు అందిస్తామన్నారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలన్నింటినీ వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయి భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజాకంటకంగా మారాయని విమర్శించారు. సీఎం చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని వివరించారు. చివరికి యువత, నిరుద్యోగుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందన్నారు. వరంగల్ రైతు సభ అనంతరం, శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.

యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందనీ, అలాంటి ప్రయత్నాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు. యువజన సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

## నీట్ యూజీ ఫలితాలు విడుదల

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

2026 నీట్ యూజీ రీ ఎగ్జామ్ రిజల్ట్స్ వచ్చేశాయి. ఈ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గురువారం రాత్రి విడుదల చేసింది. ఇందులో 19 మంది విద్యార్థులు 720 మార్కులకుగానూ 700 మార్కులు సాధించారు. పంజాబ్కు చెందిన ఆర్యన్ గుప్తా, హరియాణాకు చెందిన ప్రన్షుల్ భన్సాల్ 715 మార్కులు సాధించి ఈ పరీక్షలో టాపర్లుగా నిలిచారు. అలాగే 1492 మంది స్టూడెంట్స్ 650పైగా మార్కులు పొందారు. 10,160 మందికి 600 అంతకంటే ఎక్కువ, 90,780 మందికి 500+ మార్కులు వచ్చాయి. గతనెల 21న నీట్ రీ ఎగ్జామ్ జరిగింది. 20 లక్షలకుపైగా విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 11.21 మంది అడ్మిషన్లకు అర్హత సాధించినట్లు ఎన్టీఏ వెల్లడించింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. అయితే అర్హత సాధించిన వారిలో 58 శాతానికి పైగా అమ్మాయిలే ఉన్నారు. అయితే ఈ ఫలితాలు సకాలంలోనే విడుదలవ్వడంతో అభ్యర్థుల వైద్య కోర్సుల అడ్మిషన్లు, కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది.కాగా, ఈ ఏడాది మే 3న తొలుత నీట్ యూజీ పరీక్ష నిర్వహించారు. అయితే ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో ఆ పరీక్షను రద్దు ఎన్టీఏ చేసింది. మళ్లీ జూన్ 21న దేశవ్యాప్తంగా రీ ఎగ్జామ్ నిర్వహించింది. ఈ పరీక్షకు 20లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఈ పరీక్షకు సంబంధించి జులై 13న ఎన్టీఏ ఎఆర్ షీట్లు విడుదల చేసింది. నిన్నటి దాకా దీనిపై అభ్యంతరాలు స్వీకరించి, గురువారం ఫైనల్ కీ వెబ్సైట్లో ఉంచింది. ఆ తర్వాత కొద్ది గంటల్లోనే ఫలితాలు వెల్లడించింది.

## పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో :**

ఒడిశాలో గురువారం ప్రారంభమైన జగన్నాథుని రథయాత్రలో అపశ్రుతి జరిగింది. యాత్ర ప్రారంభమైన కొద్దిసేపటికే తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. అయితే, మృతులకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో గందరగోళ పరిస్థితి నెలకొందని, ఈ నేపథ్యంలో గ్రాండ్ రోడ్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తొక్కిసలాట జరిగిన సమయంలో దాదాపు 120 మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడినట్లు ప్రాథమిక సమాచారం. ప్రత్యేక సహాయ యూనిట్ SRU బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అస్వస్థతకు గురైన భక్తులను చికిత్స నిమిత్తం పూరీ మెడికల్ ఆసుపత్రికి తరలించాయి. పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని ఉత్సవానికి హాజరవుతున్న యాత్రికుల భద్రతను పర్యవేక్షించేందుకు అత్యవసర ప్రతిస్పందన చర్యలను ముమ్మరం చేశామని అధికారులు వెల్లడించారు.

మరోవైపు, పూరీలో వార్షిక రథ యాత్రను రాజు దివ్యసింగ్ దేవ్ 'ఛెరా పహన్‌రా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం వెండి పల్లకిలో ఆలయానికి చేరుకున్న రాజు రథాలపై ఆసీనులైన దేవుళ్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పూజారులు మంత్రోచ్చారణ చేస్తుండగా ఆయన జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్ర రథాలపై బంగారు చీపురుతో ఊడ్చే క్రతువును నిర్వహించారు. శ్రీక్షేత్ర గోవర్ధన పీఠానికి చెందిన జగద్గురు శంకరాచార్యులు దివ్య రథాలపై ఉన్న దేవతామూర్తులను దర్శించుకున్నారు. అనంతరం లక్షలాది భక్తుల జయజయ ధ్వానాల నడుమ రథయాత్ర సాగింది. స్వామివారి రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. లక్షలాదిగా వచ్చిన భక్తులతో పూరీ గ్రాండ్ రోడ్డు పూర్తిగా నిండిపోయింది.ఓ వైపు జోరుగా వర్షం కురుస్తున్న దాన్ని లెక్కచెయకుండా, భగవంతుని దర్శనం కోసం దాదాపు 2లక్షల మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఒడిస్సీతో పాటు వివిధ కళాకారులు చేస్తున్న సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. బుధవారం పూరీలో ఏకంగా 143 మిల్లీ మీటర్లకు పైగా వర్షం కురిసింది. గురువారం ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయిప్పటికీ ఉత్సవాలకు ఆటంకం కలగకుండా, రథాలు సాగే రహదారిలో నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. పూరీ గజపతి మహారాజు దివ్యసింగ్ దేవ్ సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రథాలను శుభ్రం చేసిన అనంతరం సాయంత్రం 4గంటలకు భక్తులు రథాల్ని లాగడం ప్రారంభించారు. రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి రథాలు చేరుకుంటాయి. పోలీసులతో పాటు కేంద్ర బలగాలు, నావికాదళం, తీర గస్తీ దళాలకు చెందిన 13 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఇదిలా ఉండగా, పూరీ జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ప్రముఖ సైకత శిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన జగన్నాథుని సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. ఈయన ఒడిశాలోని పూరీ తీరంలో జగన్నాథుడి రూపాన్ని అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన శిల్పం చుట్టూ ఇసుకతో దాదాపు 100 చిన్న రథాలను రూపొందించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడమే లక్ష్యంగా ఆయన ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు.ఈ కళాఖండాన్నిదాదాపు 800 ఇసుక బస్తాలను ఉపయోగించి సుమారు 2 వేల 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దారు.ఇక, గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లోని భగవాన్ జగన్నాథుని 19వ రథయాత్ర అంగరంగవైభవంగా జరుగుతోంది. ఆషాఢ శుద్ధ విదియ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. రాజ్‌కోట్‌లోని ప్రసిద్ధ మోకాజీ సర్కిల్ వద్ద ఉన్న జగన్నాథ ఆలయం నుంచి వేలాది మధ్య భక్తుల జయజయధ్వానాల మధ్య రథయాత్ర ప్రారంభమైంది. జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రా దేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతలు ఇచ్చారు. రథయాత్రలో అఘోర వేషధారణలోని కళాకారుల ప్రదర్శన కట్టిపడేసింది. శివుని సాంప్రదాయ వేషధారణలో మరికొంత మంది నందిపై కూర్చుని రథయాత్రను అనుసరించారు.

## వాంగ్‌చుక్‌ను విద్యాశాఖ మంత్రి చేయండి

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**


ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు రోజురోజుకూ పెరుగుతోంది. గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా జంతర్ మంతర్‌కు వెళ్లి వాంగ్‌చుక్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఆయన స్థానంలో సోనం వాంగ్‌చుక్‌ను విద్యా శాఖ మంత్రిగా నియమించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కేజ్రీవాల్ సూచించారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలంటే అలాంటి నిర్ణయం అవసరం అని అన్నారు. కేజ్రీవాల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పరీక్షా ప్రశ్నాపత్రాలు లీక్ అవుతున్నాయని, దాని మూల్యం దేశ యువత చెల్లిస్తోందని అన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం విద్యార్థులు, యువత, సోనం వాంగ్‌చుక్ మాటల్ని వినాలని సూచించారు. '2011లో అన్నా హజారేతో కలిసి ఇదే జంతర్ మంతర్‌లో అవినీతి వ్యతిరేక ఉద్యమం చేశాం. అప్పటి ప్రభుత్వం ప్రజల మాట వినకపోవడంతో మూడేళ్లలోనే అధికారాన్ని కోల్పోయింది. ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం యువతను పట్టించుకోకుంటే అలాంటి పరిణామాలే ఎదురవుతాయి.' అని కేజ్రీవాల్ హెచ్చరించారు. లద్దాఖ్‌కు చెందిన ఇంజినీర్, విద్యా సంస్కరణల ఉద్యమకారుడు, పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త వాంగ్‌చుక్ జంతర్ మంతర్ వద్ద 19 రోజులుగా నిరవధిక దీక్ష కొనసాగిస్తున్నారు. 2026 నీట్ యూజీ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలు, పేపర్ లీక్ వ్యవహారంపై ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రధాన్ రిజైన్ చేయాలనే డిమాండ్‌తో ఈ ఆందోళన కొనసాగుతోంది. దీక్ష నేపథ్యంలో వాంగ్‌చుక్ 9 కిలోలకుపైగా బరువు కోల్పోయారు. ఆరోగ్యం కూడా క్షీణిస్తోందని వైద్యులు హెచ్చరించారు. వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేసిన ఢిల్లీ హైకోర్టు, ఆయన ఆరోగ్యాన్ని రోజూ వైద్యులు పరిశీలించాలని ఆదేశించింది. అవసరమైతే వెంటనే వైద్య చికిత్స అందించాలని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు సూచించింది. ప్రతి పౌరుడి ప్రాణం విలువైనదేనని కోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ఆయనకు మద్దతు క్రమక్రమంగా పెరుగుతోంది. 'వాంగ్‌చుక్ ఆందోళన, బాధలో మేం కూడా భాగమే' కాంగ్రెస్ ఈ నేపథ్యంలోనే కేజ్రీవాల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా సోనం వాంగ్‌చుక్ ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించింది. వాంగ్‌చుక్‌ను దీక్ష విరమించాలని కోరారు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్. 'వాంగ్‌చుక్ ఆందోళనలు, బాధను మేం కూడా పంచుకుంటున్నాం. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని మేం కూడా కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నాం. వాంగ్‌చుక్ ఆరోగ్యం దృష్ట్యా దీక్ష విరమించాలని కోరుతున్నాం. మోదీ ప్రభుత్వంపై మా పోరాటం ఇలానే కొనసాగుతుంది.' అని సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ కూడా జంతర్ మంతర్ చేరుకొని వాంగ్‌చుక్‌ను కలిసి తమ సంఘీభావం తెలిపారు. 'బీజేపీ నాయకులు సనాతన ధర్మం గురించి మాట్లాడతారు కానీ, జాలి దయ లేని సనాతన ధర్మం ఎక్కడుంటుంది? ప్రభుత్వం తక్షణమే ఇక్కడికి వచ్చి చర్చలు జరపాలి.' అని డిమాండ్ చేశారు. యూపీలో బుల్డోజర్ చర్యల్ని ప్రస్తావిస్తూ రామాలయం భూముల కుంభకోణం వద్ద అలసిపోయిన ప్రభుత్వ బుల్డోజర్ విద్యార్థుల భవిష్యత్తును మాత్రం తొక్కేస్తుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**న్యాయ సహాయం అందిస్తామని SCBA తీర్మానం**

మరోవైపు సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యంపై సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (SCBA) ఎగ్జిక్యూటివ్ కమిటీ ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ దేశానికి వాంగ్‌చుక్ నాయకత్వం, సేవలు ఎంతో అవసరం అని, ప్రాణాల్ని పణంగా పెట్టొద్దని విజ్ఞప్తి చేసింది. విద్యావ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని రకాల లీగల్, రీసెర్చ్ సహాయం అందించేందుకు బార్ అసోసియేషన్ సిద్ధంగా ఉందని తీర్మానంలో పేర్కొంది.

**వెనక్కి తగ్గనంటున్న వాంగ్‌చుక్**

ఎందరో రాజకీయ ప్రముఖులు, మేధావులు కోరుతున్నప్పటికీ దీక్షను విరమించే ప్రసక్తే లేదని సోనమ్ వాంగ్‌చుక్ వీడియో సందేశం ద్వారా స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీలు లేకుండా వెనక్కి తగ్గితే అది తప్పుడు సంకేతాలు పంపినట్లవుతుందని తేల్చిచెప్పారు. జులై 20న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానుండగా తొలి రోజే కాక్రోచ్ జనతా పార్టీ (CJP) ఆధ్వర్యంలో చేపట్టనున్న పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని వాంగ్‌చుక్ పిలుపునిచ్చారు. ప్రముఖ రాజకీయ పార్టీలే కాకుండా రైతు నాయకుడు రాకేశ్ టికాయత్, సంగీత దర్శకుడు విశాల్ దద్లానీ, నటుడు సాయాజీ శిండే, రచయిత్రి శోభా డే వంటి ప్రముఖులు వాంగ్‌చుక్ పోరాటానికి సంఘీభావం ప్రకటించారు.



# వైభవంగా గోల్కొండ బోనాలు

**తరువాయి భాగం**

సమర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 1813 సంవత్సరంలో కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలిన సమయంలో ప్రజలు అమ్మవారిని ప్రార్థించగా, వ్యాధి తగ్గుముఖం పట్టిందనీ.. అప్పటి నుంచి ఈ బోనాల ఉత్సవం వైభవంగా కొనసాగుతోందని గుర్తు చేశారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించిందని, తెలంగాణను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు.

గోల్కొండ బోనాలకు ఘనమైన చరిత్ర ఉందని, ఇవి తెలంగాణ సంస్కృతికి, హిందూముస్లింల ఐక్యతకు నిదర్శనమని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం విషయంలో పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. జంట నగరాల్లోని అన్ని దేవాలయాల్లోనూ బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులను మంజూరు చేశారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచి శాంతిభద్రతలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

జాతరలో భాగంగా పోతురాజుల విన్యాసాలు, కళాకారుల ప్రదర్శనలు సందర్శకులను అబ్బురపరిచాయి. వేల సంఖ్యలో జనం తరలిరావడంతో గోల్కొండ కోట జనసంద్రమైంది. శివసత్తుల పూనకాలు, డప్పు దరువులతో కోట పరిసరాలు మారుమోగాయి.

# మానవత్వం చాటుకున్న బంగారు నారాయణ

- చిన్నారికి 60,000 ఆర్థిక సాయం
- సీఎం సహాయం కోసం ఎదురుచూపులు
- ఆపరేషన్ కోసం ముప్పైఏడు లక్షల ఖర్చవుతుందని డాక్టర్ల వెల్లడి

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**

గత ఐదు సంవత్సరాల నుండి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల పాపను కాపాడుతూ వస్తున్నారు.చిన్నారి ప్రసన్నకు జబ్బు పూర్తిగా నయం కావాలంటే 37,30000/ లక్షల రూపాయలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరు పెడుతున్నారు.చిన్నారి బ్రతకాలంటే ప్రతినెల రక్త మార్పిడి చేయాలని,లేకుంటే పాపం బ్రతకదని వాపోయారు.నిరుపేద కుటుంబానికి చెందిన వారు ఏం చేయాలో తెలియక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.నారాయణపేట జిల్లా,మద్దూర్ మండలం,చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన హనుమంతు,అనిత దంపతులకు ముగ్గురు సంతానం,రెండవ పాప ప్రసన్నకు మాయదారి జబ్బు పుట్టిన మూడు నెలల నుండే తలసీమియా వ్యాధి వెంటాడుతుందని తల్లిదండ్రులు వెల్లడించారు.డోనర్ కోసం గత ఐదు నెలల నుండి వేచి చూశారు.బెంగళూరు ఆస్పత్రిలో డోనర్‌కు సుమారుగా 8 లక్షల రూపాయలు ముందుగా చెల్లిస్తేనే చిన్నారి ఆపరేషన్కు సిద్ధం చేస్తామని బెంగళూరు డాక్టర్లు వెల్లడించారు.ఇప్పటివరకు చిన్నారి ప్రసన్న ఆపరేషన్ కోసం దాతల నుండి కొంతమేరకు ఆర్థిక సహాయం అందించారు.చిన్నారి ప్రసన్నది సీఎం సొంత నియోజకవర్గం,కొడంగల్ కావడంతో సీఎం సహాయం కోసం తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారు.దయచేసి రాష్ట్ర ముఖ్యమంత్రి మా పాపను ఎలాగైనా బ్రతికించాలని వేడుకుంటున్నారు.దాతలు ఎవరైనా సహాయం చేయాలనుకుంటే తండ్రి హనుమంతు అకౌంట్



నెంబర్: A/C NO: 32058485559,(SBI) IFSC SBIN0004694,మద్దూర్ బ్రాంచ్,ఫోన్ పే నెంబర్: 9676659336,కు సహాయం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పశ్చిమాసియాలో యుద్ధం ఉధృతం

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

పశ్చిమాసియాలో యుద్ధం ఉధృతం అవుతోంది. గురువారం తెల్లవారుజామున అమెరికా ఇరాన్‌పై భీకర దాడులు చేసింది. టెహ్రాన్ వ్యూహాత్మక స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించింది. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ నౌకపై దాడి చేసింది. టెహ్రాన్ ఉత్తరాన ఉన్న లక్ష్యాలపై కూడా అమెరికా సైన్యం వైమానికి క్షిపణులను వేసింది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి ఉత్పత్తి కేంద్రంపై, అంతరిక్ష కేంద్రంగా ఉన్న సెమ్నాన్ ప్రావిన్స్‌పై పెంటగాన్ గురిపెట్టింది. అహ్వాజ్‌లోని ఇరాన్ ఆస్పత్రి సమీపంలో అమెరికా క్షిపణి దాడి చేసింది. ప్రతీకారంగా గురువారం తెల్లవారుజామున ఇరాన్ అమెరికా మిత్రదేశాలను లక్ష్యంగా చేసుకుంది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్‌పై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఎనిమిది క్షిపణులను జోర్డాన్ అడ్డుకుంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలను అమలు చేస్తే.. తమ సాయుధ దళాల ఉక్కు పిడిగుద్దులతో ఆ దేశ మౌలిక సదుపాయాలను నుజ్జునుజ్జు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది.

ఇంకోపక్క ట్రంప్‌ను అంతం చేస్తామని ఇరాన్‌లో ఓ భారీ హోర్డింగ్‌పై ప్రదర్శించారు. 100 మంది అమెరికా సైనికుల్ని కిడ్నాప్ చేయాలని ఇరాన్ మాజీ మంత్రి మనుచెహర్ మొత్తకి పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించాయి. హోర్ముజ్ జలసంధిపై నౌకాయాన దిగ్బంధనాన్ని మూడు రోజుల క్రితమే అమెరికా తిరిగి విధించింది. దీంతో అమెరికా, ఇరాన్ రెండు దేశాలూ దాడులు మళ్లీ ప్రారంభించాయి.గురువారం తెల్లవారుజామున టెహ్రాన్ పరిసర ప్రాంతాల్లో అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. చాబహార్, బందర్ అబ్బాస్, ఖేష్మ్ ద్వీపం, సిరిక్, కొనరాక్, రాస్క్, ఖొండాబ్, ఖొర్రమాబాద్, సెమ్నాన్ ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు పేర్కొంది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి ఉత్పత్తి, అంతరిక్ష కార్యక్రమానికి నిలయమైన సెమ్నాన్ ప్రావిన్స్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులు చేసిందని తెలిపింది. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్ చుట్టుపక్కల ప్రాంతాలపై తొలిసారి దాడులు జరిగాయి. ఇది అమెరికన్ల లక్ష్యాలు విస్తరిస్తున్నాయని సూచిస్తోంది. గురువారం ఉదయం హమెదాన్, హోర్మొజ్గాన్, ఖుజెస్తాన్, లోరెస్తాన్, మార్కాజీ, సిస్తాన్, బలూచిస్తాన్ ప్రావిన్సుల చుట్టూ దాడులు జరిగినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఇదిలా ఉండగా, పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి టెర్మినల్ అయిన ఖర్గ్ ద్వీపం వైపు ప్రయాణిస్తున్న కురసావో జెండా కలిగిన 'బెల్మా' అనే చమురు ట్యాంకర్‌పై కాల్పులు చేశామని అమెరికా సైన్యం తెలిపింది.ఆ నౌక 'అనేక హెచ్చరికలను విస్మరించిన' తర్వాత, దాని పొగగొట్టంలోకి క్షిపణిని ప్రయోగించి, ఆ వాణిజ్య నౌకను నిలిపివేశామని పేర్కొంది. ఇరాన్‌లోని అహ్వాజ్‌లో ఉన్న షాహిద్ బాఘేయి ఆస్పత్రి సమీపంలో అమెరికా క్షిపణులు దాడి చేశాయని ఇరాన్ పేర్కొంది. ఫలితంగా రోగులను అత్యవసరంగా తరలించామని తెలిపింది. 24 గంటల్లో ఇరాన్‌పై అమెరికా రెండు భారీ దాడులను చేసింది.దీంతో ప్రతీకారంతో కువైట్‌లోని అలీ అల్ సలేం ఎయిర్ బేస్‌లో అమెరికా రాడార్ వ్యవస్థలు, పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లు, ఇంధన నిల్వ కేంద్రాలను ఐఆర్‌జీసీ లక్ష్యంగా చేసుకుంది. బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్ బేస్‌పై డ్రోన్‌దాడులు చేసి, కమ్యూనికేషన్ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. అమెరికా బలగాలు ఉన్న బహ్రెయిన్, జోర్డాన్, కువైట్‌పై గురువారం ఉదయం క్షిపణి, డ్రోన్ దాడులతో ఇరాన్ ప్రతీకారం తీర్చుకుందని ఆయా దేశాల అధికారులు తెలిపారు.తాము ఎనిమిది క్షిపణులను కూల్చివేసినట్లు జోర్డాన్ సైన్యం తెలిపింది. గురువారం మధ్యాహ్నం తమపై కొత్తగా కాల్పులు జరిగినట్లు కువైట్ తెలిపింది. ఇదిలా ఉండగా, ఇరాక్‌లోని పాక్షిక స్వయంప్రతిపత్తి గల ఉత్తర కుర్దిష్ ప్రాంతంలోని ఇర్బిల్ నగరంపై రాత్రిపూట జరిగిన డ్రోన్ దాడిని ఇరాక్ ప్రధాన మంత్రి అలీ అల్‌జైదీ ఖండించారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షునిగా జంగా అనిల్

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని చిన్న రాతుపల్లి గ్రామ ఉప సర్పంచ్ జంగా అనిల్ ను పెద్దపల్లి జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నిక ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఖడ్గం స్వప్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు జంపన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జంగా అనిల్ కు పెద్దపల్లి ఉపసర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా నియమక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జంగా అనిల్ మాట్లాడుతూ...ఉప సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షునిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షునికి, రాష్ట్ర కార్యవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.రాష్ట్ర నాయకత్వం నా పైన ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయనని అన్నారు.ఉప సర్పంచ్ ల హక్కుల సాధనకై పోరాటం చేయడంలో ముందు వరుసలో ఉంటానని ఆయన తెలిపారు.

# పిడిఎస్ బియ్యం దొంగల పైన చర్యలు తీసుకోవాలి

- అసలైన బియ్యం దొంగలను వదిలి పెట్టి దళితులపై పిడి యాక్ట్ లు ఎందుకు
- అక్రమంగా మిల్లులలో రీసైకిలింగ్ చేస్తున్న వారిపైన పిడి యాక్ట్ పెట్టాలి
- చిన్న రైస్ మిల్లులను ఈ ప్రభుత్వం కాపాడాలి
- తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్

**కరీంనగర్ తెలంగాణ చౌరస్తా:**



కరీంనగర్ జిల్లాలో వివిధ గోధుమలలో ఉన్నటువంటి బియ్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్ గేట్ సమీపంలోని ఒక రైస్ మిల్లుకు తరలించి రీసైకిలింగ్ చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ఇదే విషయంలో జిల్లా కలెక్టర్ ను,అదనపు కలెక్టర్లకు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ....గత ప్రభుత్వ హయాంలో మిగిలిన బియ్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా టెండర్ లో పాల్గొన్న ఒక రైస్ మిల్ యాజమాని అడుగడుగునా ప్రభుత్వం పెట్టిన కండిషన్స్ తుంగలో తొక్కుతూ అక్రమ మార్గాన టెండర్ దక్కించుకుని దొడ్డు బియ్యాన్ని ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బియ్యం నిలువలు ఉన్న చోటు నుండి దొంగతనంగా తనకు సంబంధించిన రైస్ మిల్లులో అతడికి బినామిగా ఉన్న మరికొన్ని రైస్ మిల్లులలో అర్ధరాత్రి దాటిన తరువాత దించుకుని రీపాలిషింగ్ చేసి తరలిస్తున్నారని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.అదికూడా రాజీవ్ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్ గేట్ సమీపంలోని రైస్ మిల్లో నిబంధనలకు బేఖాతరు చేస్తూ అక్రమంగా బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ సివిల్ సప్లయ్ అధికారుల,ప్రభుత్వం అనుమతి లేకుండానే తరలించి రీపాలిషింగ్ చేస్తున్నారని,ఈ బియ్యాన్ని రీపాలిషింగ్ చేసి మార్కెట్లో విక్రయించడమే కాకుండా ప్రస్తుతం ఎఫ్.సి.ఐ కి కూడ సరఫరా చేసేందుకు అనుమతులు రావడంతో బియ్యాన్నే దొంగదారిన రీపాలిష్ చేసి ఎఫ్.సి.ఐకి అందించేందుకు పక్క పథకాన్ని రచించారని,నిజానికి ఈ బియ్యం ఇథనాల్ తయారీకి లేదా పశుగ్రాసానికి ఉపయోగించాల్సిన బియ్యాన్ని ఈ మాఫియా ముఠా అక్రమ మార్గాల్లో రీసైక్లింగ్ చేయడం ద్వారా ప్రభుత్వ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నారున్నారు.జిల్లా పౌరసరఫరాల అధికారి,విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్,సంబంధిత అధికారులతో తక్షణమే విచారణ జరిపించి,నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన బియ్యాన్ని సీజ్ చేయవలసిందిగా కోరుతూ రీపాలిసింగ్ చేస్తున్న వారిపైన జిల్లా యంత్రాంగం విచారణ జరిపి బియ్యం దొంగలపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి,అదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్,బాసవేణి రజేందర్,మ్యాక వినోద్,నూతి చరణ్ తదితరులు పాల్గొన్నారు.




# ఎల్‌నినో దుష్ప్రభావాలుపై అవగాహన కల్పించిన అధికారులు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

పాలకుర్తి రైతు వేదిక లో అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితి దృష్ట్యా,ఈ సీజన్ మొత్తం మంచి వర్షపాతం లేదని,తద్వారా జలాశయాలు నిండే పరిస్థితి లేదని,దీనితో కాలువల ద్వారా నీటి సరఫరా,చెరువుల ద్వారా నీరు అందించే అవకాశం లేదు ప్రాజెక్టులలో నీరు చేరకపోవడం వల్ల బోర్లలో,బావులలో మోటర్లు ఎక్కువ రోజులు నడిచే పరిస్థితి ఉండదని,ఈ నేపథ్యంలో బోర్ల క్రింద,బావుల క్రింద ఎట్టి పరిస్థితిలోనూ అతి ఎక్కువ నీరు అవసరమైన వరి పంట సాగు చేయవద్దని రైతులకు ఈ సందర్భంగా అధికారులు వివరించారు.రైతులు మొత్తం విస్తీర్ణంలో వరి సాగు చేయకుండా,కొంత భాగంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి ముఖ్యంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలు ఇవి మేలు..జొన్న, పెసలు, మినుములు,కంది,పొద్దుతిరుగుడు,నువ్వులు,సోయాబీన్ ,ఆముదం,రాగులు రైతులందరూ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును కొంత మేర తగ్గించి,ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపవలసిందిగా అధికారులు తెలియజేశారు.ఎస్సీ,ఎస్టీ రైతు సోదరులకు ఉచిత పథకాల పై సమాచారం అందజేశారు. ఎస్సీ రైతులకు మాత్రమే ఉచితంగా రాగి విత్తనాలు,ఆరుతడి పంటలకు కలుపు తీయు యంత్రాలు / వీడర్లు రూ 2000 విలువ గలది ఈ సందర్భంగా అధికారులు ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు.ఎస్టీ రైతులకు ఉచితంగా ఇంటి పెరటి కూరగాయ విత్తనాల కిట్లు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జి.శ్యాం ప్రసాద్,రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఓ. సంపత్,రామగుండం ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి,పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, ఉద్యానవన శాఖ అధికారి ఏ.జ్యోతి,హెచ్.ఈ.ఓ బి.రాము,తిరుమల ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రశాంత్,ఏ.ఈ.ఓ లు ఎం.సువర్ణరేఖ,కే.శ్రీకాంత్,జే.సుష్మ అధిక సంఖ్యలో సన్న చిన్న కారు ఎస్సీ రైతులు పాల్గొన్నారు.



# భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ భావజాల వ్యాప్తి జరగాలి

- ఎమ్మార్పీఎస్ అధినేత,పద్మశ్రీ మందకృష్ణ మాదిగ
- కె.యూ అంబేద్కర్ సెంటర్ జాయింట్ డైరెక్టర్‌గా...
- డా.పుల్ల శ్రీనివాస్ పదవీ బాధ్యతల స్వీకరణ
- అభినందలు తెలిపిన పలువురు...

**కె.యూ క్యాంపస్, తెలంగాణ చౌరస్తా:**

సమాజ అభివృద్ధి కోసం,అణగారిన వర్గాల సంక్షేమం భారత రత్న డా.అంబేద్కర్ భావజాల వ్యాప్తితోనే జరుగుతుందని ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు.కాకతీయ యూనివర్సిటీ అంబేద్కర్ సెంటర్ జాయింట్ డైరెక్టర్ గా డాక్టర్ పుల్ల శ్రీనివాస్ గురువారం రోజున పదవీ బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ శ్రేణులు ,దళిత వర్గాల నేతృత్వంలో కేయూ గ్రంథాలయం నుంచి అంబేద్కర్ స్టడీ సెంటర్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.అనంతరం డా.పుల్ల శ్రీనివాస్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని కేయూ రిజిస్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్ర నుంచి బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ... డాక్టర్ పుల్ల శ్రీనివాస్ నేతృత్వంలో అంబేద్కర్ సెంటర్ అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.అంబేద్కర్ భావజాలాన్ని,అంబేద్కర్ సిద్ధాంతాలను సమాజంలో అన్ని వర్గాలకు చేరవేసి సమాజ ఉన్నతిని పాటుపడాలని కోరారు.బహుజనులకు అంబేద్కర్ సెంటర్ విజ్ఞానాన్ని పంచాలని,అండగా నిలవాలని తెలిపారు.జాయింట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పుల్ల శ్రీనివాస్ ని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓఎస్డి ప్రొఫెసర్ బైరు వెంకటరామిరెడ్డి,క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్,పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేష్లాల్ డాక్టర్ చిర్రా రాజు గౌడ్,ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్. రమణ ప్రొఫెసర్ కే.బిక్షాలు,పలు విభాగాల అధిపతులు ప్రొఫెసర్ ఏం స్వర్ణలత,ప్రొఫెసర్ ఎల్పీ రాజకుమార్,డాక్టర్ బి.ఎస్.ఎల్ సౌజన్య,డాక్టర్ తాడూరి శాస్త్రి, ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు,డాక్టర్ మామిడి లింగయ్య,డాక్టర్ గడ్డం కృష్ణయ్య,డాక్టర్ సంకినేని వెంకట్ ,అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పోడేటి శ్రీనివాస్ డాక్టర్ ఎన్.సుజాత,వివిధ సంఘాల ప్రతినిధులు డాక్టర్ సంఘాల ఎఫ్రామ్ రాజ్,డాక్టర్ కొట్టే భాస్కర్,మెట్టు రవి,కచ్చకాయ చిరంజీవి,పి.రవి బొక్క మొగిలి,కిరణ్,బోళ్ళేపాక ప్రభాకర్,భాస్కర్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంద కుమార్,గద్దల సుకుమార్,పుట్ట రవి,స్టూడెంట్స్ యూనియన్ నాయకులు బొచ్చు తిరుపతి, మంద నరేష్,మంద భాస్కర్, బొట్ల మనోహర్,డాక్టర్ గుండేటి సుమన్,కలకోట సుమన్, తదితరులు పాల్గొన్నారు.



# లైసెన్సులు ఇప్పించండి

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**

ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ,ఆదివాసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి నిరుద్యోగ యువతీ,యువకులకు లైసెన్సులు ఇప్పించండి అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కు వినతి పత్రం అందజేశారు. మండలంలో ఆదివాసి నిరుద్యోగులు ఎక్కువగా ఉండడంతో వారు లైసెన్స్ లేక సతమతమవుతుండడంతో వారికి లైసెన్సులు ఇప్పించండి అని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెంద్రం శంకర్,గ్రామ పటేల్ వల్క శంకర్,తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు ఆడ జంగు,తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పెంద్రం హనుమంతు,ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సీడం గణపతి,తుడుం దెబ్బ మండల అధ్యక్షులు మంగ శ్రీకాంత్,గౌరవాధ్యక్షులు జంగు,ఆదివాసి విద్యార్థి సంఘం అధ్యక్షులు పెంద్రం ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.



# వందశాతం సర్ ప్రక్రియ పూర్తి చేయాలి

- సర్పంచ్ సతీష్ ఆధ్వర్యంలో సమావేశం..
- తహసీల్దార్ వన జానాయక్,ఎంపిడిఓ అనిల్ రెడ్డి హాజరు
- బి ఎల్ వో లకు సన్మానం

**ఓదెల, తెలంగాణ చౌరస్తా:**

ఓదెల గ్రామంలో సర్ ప్రక్రియ సమీక్షా సమావేశం సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో జరుగగా, ముఖ్య అతిథిగా స్థానిక తహసీల్దార్ వన జానాయక్ హాజరై గ్రామంలో సర్ ప్రోగ్రామ్ జరుగుతున్న తీరును ఒక్క ఓటర్ కూడా ఓటు పోకుండా చాలా జాగ్రత్తగా నిర్వహించాలని వందశాతం సర్ ప్రక్రియ చేయాలని,ప్రభుత్వం ఆగష్టు 3 వ తేదీ వరకు గడువు పొడిగించినందున మండలం మొత్తం కూడా వందశాతం పూర్తి చేయాలన్నారు.ఈ సందర్భంగా సర్ పూర్తి చేసిన ఓదెల బి ఎల్ వో లు స్వరూప,సుమలత,రమాదేవిలను తహసీల్దార్ వన జానాయక్,ఎంపిడిఓ అనిల్ రెడ్డి,సర్పంచ్ కనికిరెడ్డి సతీష్‌లు గ్రామ పంచాయతీ లో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకట లక్ష్మణ్ వార్డు సభ్యులు దూలం సదానందం బి ఎల్ వో లు స్వరూప,సుమలత, రమాదేవి,లావణ్య,రమా,చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.




# పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి
- రహదారి భద్రత నియమాలు పాటించండి
- రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**

కాసిపేట మండలంలోని దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ముఖ్య అతిథిగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరయ్యారు.పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను,మంచిర్యాల డిసిపి భాస్కర్లను గ్రామస్తులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.అనంతరం సీపీ మాట్లాడుతూ.... మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,మత్తు పదార్థాలు వ్యక్తిని,కుటుంబాన్ని, సమాజాన్ని నాశనం చేస్తాయన్నారు.అందరూ రహదారి నియమాలు పాటించాలని విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.ప్రజల భద్రత, సంక్షేమం కొరకు పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్,మందమర్రి సిఐ రమేష్,దేవాపూర్ ఎస్సై గంగారాం,కాసిపేట ఎస్సై ఆంజనేయులు,మందమర్రి ఎస్సై నరేష్,రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్,మెడి లైఫ్ హాస్పిటల్,సన్ రైజ్ హాస్పిటల్ డాక్టర్లు,సిబ్బంది,స్థానిక ప్రజా ప్రతినిధులు,యువకులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా 'సర్' ప్రక్రియ

- వందశాతం సర్ ప్రక్రియ పూర్తి చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఆగస్టు 03 వరకు పొడిగింపు
- ఓటరు తమ ఓటును నమోదు చేసుకోండి
- స్థానిక బి ఎల్ వోల ను సంప్రదించండి
- జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరు సతీష్ కుమార్

**హనుమకొండ,తెలంగాణ చౌరస్తా:**



భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ చేపడుతోందని,అందులో భాగంగా రాష్ట్రంలో కూడా సర్ కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరు సతీష్ కుమార్ అన్నారు. ఈసీఐ విధి విధానాల ప్రకారం ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు అనేది నిరంతర ప్రక్రియని,ఏ కారణంతోనైనా సర్‌లో వివరాలు నమోదు చేసుకోకుంటే తర్వాత కూడా అవకాశం ఉంటుందని ఈసీఐ వర్గాలు చెబుతున్నాయని,సర్‌లో నమోదు కాకపోయినా తర్వాత దరఖాస్తు చేసి ఓటర్ల జాబితాలో పేరు చేర్పించుకోవచ్చునని,బీఎల్‌వోలు,ఎన్నికల అధికారులు దరఖాస్తు,పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారించిన తర్వాత దరఖాస్తుదారుడి పేరును ఓటర్ల జాబితాలో చేరుస్తారని,అర్హత ఉన్న ప్రతి పౌరుడికీ అవకాశం ఉంటుందని,అయితే తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) పొడిగించిందని,అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం బుధవారం సవరించిందన్నారు.దీంతో బి ఎల్ వోల ఇంటింటి సర్వేకు ఆగస్టు 3 వరకు గడువు పొడిగించినట్లు అయిందని,ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయనుందన్నారు.సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్‌లు ,అభ్యంతరాలను స్వీకరించనుందని,అక్టోబర్ 8వ తేదీ వరకు అభ్యంతరాలను పరిష్కారించనుందని,అక్టోబర్ 12న తుది ఓటరు జాబితాను ప్రచురించనుందని,సర్ గడువును పొడిగించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని తెలిపారు.దీంతో సర్ షెడ్యూల్‌ను సీఈసీ సవరించిందని,దీనిని అధికారులతోపాటు రాజకీయ పార్టీలకు తెలియజేయాలని జారీ చేసిన ఆదేశాల్లో సీఈసీ స్పష్టం చేసిందన్నారు.ఈ సమయంలో ప్రతి ఒక్కరూ తమ యొక్క ఓటును నమోదు చేసుకోవాలని,సమస్యల పరిష్కారానికి స్థానిక బి ఎల్ వో లను సంప్రదించాలని కోరారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని కలిసిన వొడితల ప్రణవ్

- అంబేద్కర్ భవనం,దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియ...
- వెనకబడిన సంక్షేమ శాఖ నిధుల మంజూరుకు విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన మంత్రి

**హుజురాబాద్, తెలంగాణ చౌరస్తా:**



హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు.హైదరాబాద్ సెక్రటేరియట్ లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ప్రొసీడింగ్ ఇచ్చి అసంపూర్తిగా నిర్మించిన దానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని,దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు దళిత బంధు అందేలా చూడాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి దీనిపై ఇప్పటికే పలుమార్లు చర్చించినట్టు తెలిపారు.మరోవైపు హుజురాబాద్ నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ పాఠశాలలో వసతులకు నిధులు కేటాయించాలని కోరారు.

# రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలి

- కమాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**



ప్రస్తుత సాగు కాలంలో వర్షాల లేమి, నీటి ఎద్దడి పరిస్థితుల దృష్ట్యా రైతు సోదరులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని కమాన్‌పూర్ మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ కోరారు. గుండారం గ్రామంలోని రైతు వేదికలో రైతులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల వర్షపాతం గణనీయంగా తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాదితో పోల్చితే ఈ నెలలో భూగర్భ జలాలు సుమారు ఒకటిన్నర నుంచి రెండు మీటర్ల మేర అడుగంటిపోయాయని వివరించారు. దీనివల్ల బోర్లు, బావుల కింద సాగయ్యే వరి పంటపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో పూర్తిస్థాయిలో నీరు చేరకపోవడంతో కాలువల ద్వారా నీటి సరఫరా తగ్గుతుందని, ఈ పరిస్థితులను గమనించి రైతులు ఎక్కువ నీరు అవసరమయ్యే వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే అపరాలు పప్పుధాన్యాలు, ఇతర ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలన్నారు. అలాగే కూరగాయలు వంటి ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు..**

ఎల్నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) డి. శ్వేత, వి. నవీన్ కలిసి నాగారం, గొల్లపల్లి, గుండారం గ్రామాల్లో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు జంగిలి పోచాలు, పొనగంటి కుమార్, శీలారపు మల్లయ్య, ఉపసర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కన్నెపల్లి మోటర్లు ఆన్ చేయండి

- భేషజాలకు పోకుండా సాగునీళ్లు విడుదల చేయాలి
- కాళేశ్వరం పంపులు వెంటనే ప్రారంభించి చెరువులను నింపాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్ డిమాండ్



**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**

కాంగ్రెస్ ప్రభుత్వం భేషజాలు పక్కన పెట్టి కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణలో సాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతోందని, ఎండిపోయిన చెరువులను నింపేందుకు ప్రభుత్వం తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపులను ప్రారంభించాలని ఆయన కోరారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి ప్రాంతంలో ఎల్లమ్మ చెరువు సహా అనేక చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు నాట్లు వేయలేక అల్లాడుతున్నారని రాకేష్ కుమార్ పేర్కొన్నారు. డీ83, డీ86 కాలువల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో సాగునీటి సమస్య జఠిలమైందని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో 2.79 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈసారి కేవలం 12 వేల ఎకరాలకు మాత్రమే పరిమితమైందని గణాంకాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కంటే బీఆర్ఎస్ నాయకులను విమర్శించడానికే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రెస్‌మీట్లతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. "రక్తాలతోనే పంటలు పండుతాయి అనుకుంటే, ఎవరి రక్తం వాడాలో ప్రజలే నిర్ణయిస్తారు " అంటూ రాకేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రెండేళ్లు గడిచినా కనీసం పనులు ప్రారంభించలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు చేసిన సవాల్‌ను ప్రభుత్వం స్వీకరించాలని, అవసరమైతే నిర్వహణ బాధ్యతలను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణరావు పెద్దపల్లి సాగు పరిస్థితిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీధర్ బాబు తండ్రి పేరుతో ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిని నింపాలని కోరారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని ఆయన వెల్లడించారు. తాగునీటి అవసరాలు, ఎన్టీపీసీ అవసరాలను దృష్టిలో ఉంచుకుంటే, సాగునీటికి తీవ్ర కొరత తప్పదని హెచ్చరించారు. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు చేపట్టి శ్రీపాద ఎల్లంపల్లిని నింపి, ఆ నీటిని చెరువులకు తరలించాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు ఆరుతడి పంటలు వేయాలని సూచిస్తున్నారని, ఇది రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ఎద్దడికి నిదర్శనమని రాకేష్ కుమార్ అన్నారు. రాజకీయ విమర్శలు మానుకొని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందని, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్ స్వామి , ఉప సర్పంచ్ మేకల కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి, పడాల సతీష్ గౌడ్, పోసాని శ్రీనివాస్ యాదవ్, ఉప్పు శివ కుమార్, బోయిని మనోజ్, కంచి నాగరాజ్ , పాయిలి కిరణ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంధకారంలో పోలీస్ స్టేషన్ మూల మలుపు రోడ్డు

- గత వారం రోజులుగా రాత్రి పూట వెలుగని హెడ్ మాక్ లైట్స్
- బల్బులు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్



**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో నిత్యం ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తూ ఉంటున్నారు. ప్రధాన కూడలి అయిన పోలీస్ స్టేషన్ వెళ్లే మూల మలుపు వద్ద ఏర్పాటు చేసిన హెడ్ మాక్ లైట్స్ దాదాపు వారం రోజుల నుంచి రాత్రిపూట వెలుగు అందించక అంధకారంలో ఉంటుంది.వివిధ గ్రామంలోని ప్రజలు ఇదే మూల మలుపు రోడ్డు నుండి నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు లైట్ వెలుగు లేక చీకట్లోనే వేచి ఉంటూ ప్రయాణిస్తున్నారు.ప్రయాణికులు,ప్రజల భద్రత నిమిత్తం ఇప్పటికైనా సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు,చర్యలు తీసుకొని హెడ్ మాక్ లైట్స్ ఏర్పాటు చేయాలని మండల కేంద్రంలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## గుండారం లో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం

- మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో కమాన్‌పూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా
- సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్
- మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన గ్రామ పాలకవర్గం

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో కమాన్‌పూర్ గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అన్నారు. కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్‌లో ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనకు తమ పాలకవర్గం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే సుభాష్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కమాన్‌పూర్ గ్రామ అభివృద్ధికి నిరంతరం అండగా నిలుస్తున్న మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్, వార్డు సభ్యులు గుంజపడుగు నవీన్, కమ్మగోని మౌనిక, మల్లారపు మానస, మేడగోని సత్యమ్మ, బోగే లక్ష్మి, మెరుగు కుమార్, గోడిశెల లింగస్వామి, ముఖ్య నాయకులు నగునూరి నర్సయ్య, రంగు శ్రీనివాస్, బొజ్జ రాజసాగర్, బొజ్జ చారి, గర్రెపెల్లి వెంకన్నతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో మహిళకు గాయాలు



**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన కొలిపాక అనూష అనే మహిళ కోతుల దాడిలో గాయపడింది. గురువారం రోజున ఆమె తమ పశువుల పాక వద్దకు వెళుతున్న సమయంలో ఒక్కసారిగా కోతుల గుంపు వెంటాడి తరిమి కరవడంతో ఆమెకు గాయాలయ్యాయి. గాయపడిన అనూష కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోగా, వైద్య సిబ్బంది ఆమెకు ఇంజక్షన్లు వేశారు. కాగా, కమాన్‌పూర్ మండలంలోని పేరపల్లి, రొంపికుంట, గుండారం, రాజాపూర్ తదితర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. వందల సంఖ్యలో కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకుని కోతుల బెడద నుండి విముక్తి కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## టిఎఎస్ ఫెలోగా ప్రొ. లక్ష్మణ్ నాయక్

**తెలంగాణ చౌరస్తా,సికింద్రాబాద్:**



ఉస్మానియా యూనివర్సిటీ, సైన్సు కళాశాల ఫిజిక్స్ ప్రొఫెసర్ జె. లక్ష్మణ్ నాయక్ ఫిజిక్స్ ప్రొఫెసర్ & చైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఇన్ ఫిజిక్స్, ఉస్మానియా యూనివర్సిటీ భౌతిక శాస్త్ర రంగంలో ఆయన చేసిన విశేష కృషి, అద్భుతమైన పరిశోధనలు, విద్యాసంబంధిత నాయకత్వానికి గుర్తింపుగా తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (TAS) ఆయనను ప్రతిష్టాత్మక 'ఫెలో' గా ఎన్నుకోవడం ఎంపిక చేసినట్లు ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఈ విశిష్ట గౌరవం ఆయన శాస్త్రీయ నిబద్ధతకు నిదర్శనం. ఉస్మానియా యూనివర్సిటీ గర్వకారణం నిలిచింది. అయిన గతంలో సైఫాబాద్ సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ గా విశిష్ట సేవాలు అందజేశారు. ప్రొ. లక్ష్మణ్ నాయక్‌కు విభాగం ఆచార్యులు, విద్యార్థులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బినామీల ముసుగు వెనుక అక్రమార్కులు ఎవరు..?

- గుట్ట పైన దేవుడు.. గుట్ట కింద అక్రమార్కుల నగ్న నర్తనం!
- అధికారులు ఎందుకు ఇంత మౌనం...!
- లక్ష్మీదేవిపల్లిలో 1/70 చట్టానికి సమాధి..
- రియల్ మాఫియా గుండాయిజం..!
- నోట్ల కట్టల మత్తులో రెవెన్యూ, పంచాయతీ అధికారులు.. ఏసీ రూములకే పరిమితం!
- బినామీల గుట్టు రట్టు చేస్తాం ఆర్ టీ ఐ అస్త్రంతో గిరిజనుల యుద్ధప్రకటన.. గ్రీవెన్స్ డే నాడు కలెక్టరేట్ ముట్టడికి సై!





**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

లక్ష్మీదేవిపల్లి మండలంలో రియల్ మాఫియా ఆగడాలు శ్రుతిమించాయి. గిరిజన ప్రాంతాల రక్షణ కవచం లాంటి 'ఏజెన్సీ చట్టం 1/70' యాక్ట్ నిబంధనలను నడిరోడ్డుపై నరికి చంపేస్తూ అక్రమ వెంచర్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. డీటీసీపీ అనుమతులు ఉన్నాయా లేవా, ఉంటే 1/70 లో పరిమిషన్ ఎవరు ఇచ్చారు అసలు ప్రభుత్వ నిబంధనలంటేనే వీరికి లెక్క లేదు. సామాన్యుల రక్తాన్ని పిండి, కష్టార్జితాన్ని లూటీ చేస్తూ రియల్ మాఫియా విచ్చలవిడిగా రెచ్చిపోతోంది. క్షేత్రస్థాయిలో ఇంతటి నగ్న నర్తనం జరుగుతున్నా, అటు రెవెన్యూ, ఇటు పంచాయతీ అధికారులు కళ్ళుండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు విసిరే నోట్ల కట్టల మత్తులో మునిగి తేలుతున్న అధికారులు, ఆ ముడుపుల అంధకారంలోనే బతుకుతున్నారనే ఆరోపణలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా దావానలంలా రేగుతున్నాయి.

**ప్రభుత్వ భూములపై పగబట్టిన అక్రమార్కులు.. అసలు వీరెవరు?**

ఈ అక్రమ వెంచర్లలో కేవలం ప్రైవేటు భూములే కాదు..సాక్షాత్తూ ప్రభుత్వ భూములను,పోరంబోకు స్థలాలను సైతం మింగేసి ప్లాట్లుగా మార్చేశారు.

**అసలు ఈ భూమి ఎవరిది?**
**ఎక్కడి నుంచి ఊడిపడింది?**
**చట్టప్రకారం ఇక్కడ కొనడానికి, అమ్మడానికి అసలు అర్హత ఎవరికుంది?**

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఒక్కటే... "బినామీల ముసుగు!" తెరవెనుక ఉన్న బడా రాజకీయ నాయకులు, అక్రమార్కులు బినామీల ముసుగులో అమాయక మధ్యతరగతి ప్రజలకు ఈ అక్రమ గుంటలను అంటగట్టి కోట్లు కూడబెడుతున్నారు. తీరా ఆశపడి కొన్న సామాన్యులు.. ఇల్లు కట్టుకుందామంటే అనుమతులు రాక, బ్యాంకు రుణాలు దొరకక, పోనీ వేరే వాళ్లకు అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్లు కాక రోడ్డున పడ్డారు. మోసపోయామని తెలిసి నెత్తీ నోరూ బాదుకుంటూ నిర్వాహకులను నిలదీస్తే.. "ఏం చేసుకుంటారో చేసుకోండి.. మా వెనుక అధికారులు, నాయకులు ఉన్నారు" అంటూ రౌడీయిజానికి దిగుతుండటం ఇక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.

**నిమ్మకు నీరెత్తిన జిల్లా ఉన్నతాధికారులు!**

వందల ఎకరాల్లో అక్రమ వెంచర్లు వెలుస్తూ, కొండలను గుట్టలను పిండి చేస్తుంటే.. అధికారులు తమ ఏసీ గదుల్లో కూర్చుని ముడుపుల మత్తులో జోగుతున్నారా? అక్రమ లేఅవుట్ల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్న కనీస జ్ఞానం కూడా అధికారులకు లేదా? లేక ఆ అక్రమార్కుల లాభాల్లో వీరికి కూడా వాటాలు అందుతున్నాయా? ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు గుడ్డిగా నటిస్తున్నారు? దేనికోసం ఈ నిమ్మకు నీరెత్తిన ధోరణి?

ఆదివాసుల ఆగ్రహజ్వాల

**ఆర్.టి.ఐ అస్త్రంతో గుట్టు రట్టు.. కలెక్టరేట్ గెరిల్లా ముట్టడి!**

ఈ రియల్ రాక్షసత్వంపై స్థానిక గిరిజనులు, ఆదివాసి సంఘాలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. బినామీ ముసుగులో ఏజెన్సీ చట్టాలను ఖూనీ చేస్తున్న అక్రమార్కులను, వారికి వత్తాసు పలుకుతున్న అవినీతి అధికారులను ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని గిరిజన నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే సమాచార హక్కు చట్టం (ఆర్ టీ ఐ ) అస్త్రం ద్వారా అక్రమ వెంచర్ల జాతకాన్ని, దాని వెనుక ఉన్న తిమింగలాల పేర్లను బయటకు తీసే పనిలో పడ్డారు.

**ఈ అవినీతి బండారాన్ని బట్టబయలు చేస్తాం.**

రాబోయే గ్రీవెన్స్ డే (ప్రజావాణి) రోజున జిల్లా కలెక్టరేట్‌కు లిఖితపూర్వకంగా ఘాటైన ఫిర్యాదు లేఖ (లెటర్) ఇవ్వడానికి సిద్ధమయ్యారు. అంతేకాదు, కేవలం వినతిపత్రాలకే పరిమితం కాకుండా.. బాధ్యులైన రియల్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టి, అవినీతి అధికారులను సస్పెండ్ చేసే వరకు కలెక్టరేట్‌ను ముట్టడించి తీరుతామని ఆదివాసులు సమరశంఖం పూరించారు. నిజాయితీ గల ఉన్నతాధికారులైనా ఇకనైనా నిద్ర మత్తు వదిలి, లక్ష్మీదేవిపల్లిలో సాగుతున్న ఈ రియల్ దోపిడీపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని, లేదంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష 2027 దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

- 6వ తరగతిలో ఉచిత విద్యకు సువర్ణావకాశం
- దరఖాస్తుకు చివరి తేదీ: 31 జూలై 2026
- ప్రవేశ పరీక్ష తేదీ: 28 నవంబర్ 2026



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

గ్రామీణ వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నాణ్యమైన, ఉచిత విద్యను అందించే జవహర్ నవోదయ విద్యాలయ (ఏ ఎన్ వి) 6వ తరగతి ప్రవేశ పరీక్ష - 2027 ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డి ఈ ఓ ) ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఆసక్తి గల విద్యార్థులు క్రింది అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా మాత్రమే
అధికారిక వెబ్‌సైట్లు:
☐ navodaya.gov.in
☐ cbseitms.rcil.gov.in/nvs/
దరఖాస్తుకు చివరి తేదీ: 31 జూలై 2026
ప్రవేశ పరీక్ష తేదీ: 28 నవంబర్ 2026
ప్రధానోపాధ్యాయులు,
ఉపాధ్యాయులకు విజ్ఞప్తి:

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్ ఎం లు), ఉపాధ్యాయులు ఈ సమాచారాన్ని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు విస్తృతంగా చేరవేయాలని జిల్లా విద్యాశాఖ ఆదేశించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా పాఠశాలల స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

గమనిక: ఉచిత వసతి, భోజనం మరియు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను పొందేందుకు గ్రామీణ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ కోరింది.

## ప్రజల మనిషి... ప్రజాసేవలోనే ముందడుగు

- చెంబునిగూడెంలో జోరుగా పారిశుద్ధ్య పనులు
- ప్రజల మెచ్చిన నాయకుడు 'సర్పంచ్ బట్టు శివ'
- రోడ్ల క్లీనింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు,
- చేను బాట రోడ్ల పునరుద్ధరణపై గ్రామస్తుల హర్షం





**టేకులపల్లి, భద్రాద్రి బ్యూరో,తెలంగాణ చౌరస్తా:**

పదవుల కోసం పాకులాడే నాయకులున్న నేటి రోజుల్లో... తనను నమ్మి ఓటు వేసిన ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజాసేవకు సరికొత్త అర్థం చెప్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం చెంబునిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ బట్టు శివ. గతంలో ఎంపీటీసీగా సేవలందించి, ప్రస్తుతం తన సొంత ఊరిలోనే సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన, ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో గ్రామస్తులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచ్ బట్టు శివ, ఉపసర్పంచ్ దంసలపూడి శ్రీను, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ) లతో కలిసి సమన్వయంతో రంగంలోకి దిగారు.

**యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు..**

వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో చెంబునిగూడెం పంచాయతీలో చాకచక్యంగా పనులను పూర్తి చేస్తున్నారు.

**చెట్ల కొమ్మల తొలగింపు:**

రోడ్లపైకి వచ్చి వాహనదారులకు, ప్రజలకు ఆటంకంగా మారిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.

**విద్యుత్ వెలుగులు:**

వర్షాకాలంలో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా గ్రామంలోని ప్రధాన వీధుల్లో విద్యుత్ లైట్లను అమర్చారు.

**సైడ్ డ్రైనేజీల క్లీనింగ్:**

దోమల వ్యాప్తి చెందకుండా సైడ్ డ్రైనేజీలను శుభ్రం చేయించి, కాలవలపై బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

**రైతన్నల కోసం 'చేను బాట' రోడ్ల ముస్తాబు!**

వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో సర్పంచ్ బట్టు శివ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పొలాలకు వెళ్లే దారిలో గుంతలు పడి, ట్రాక్టర్లు వెళ్లడానికి, యూరియా బస్తాలు తీసుకెళ్లడానికి తీవ్ర అవస్థలు పడుతున్న రైతులకు భరోసానిస్తూ... పొలం బాట పట్టే రోడ్లను యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయించారు. దీంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**"ఏ గడపకు ఆపద వచ్చినా నేనుంటా..!"**

ఈ సందర్భంగా సర్పంచ్ బట్టు శివ మాట్లాడుతూ... "నన్ను నమ్మి గెలిపించిన ప్రజలను కాపాడుకోవడమే నా ప్రథమ లక్ష్యం. రాబోయే ఐదేళ్ల కాలంలో ఈ గ్రామానికి ఒక పెద్ద కొడుకులా బాధ్యత తీసుకుంటాను. ఏ ఇంటికి, ఏ గడపకు ఆపద వచ్చినా నేను ముందుంటాను. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే నా ధ్యేయం" అని స్పష్టం చేశారు.

గతంలో ఎంపీటీసీగా ఉండి, ఇప్పుడు సర్పంచ్‌గా ఊరి రూపురేఖలు మారుస్తూ, నిరంతరం ప్రజల్లోనే ఉంటున్న బట్టు శివ పనితీరుపై చెంబునిగూడెం గ్రామస్తులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. "ప్రజలు మెచ్చిన అసలైన ప్రజా నాయకుడు" అంటూ కొనియాడుతున్నారు.

## జన్మదిన వేడుకల్లో సేవా స్ఫూర్తి

- విద్యార్థులకు టైలు, బెల్టులు పంపిణీ
- రావుల జైదీప్

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం మడిపల్లి గ్రామానికి చెందిన రావుల జైదీప్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టైలు, బెల్టులు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నలుగురి రామలింగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ నలుగురి రామలింగం మాట్లాడుతూ..పుట్టినరోజులను ఆడంబరంగా జరుపుకోవడం కంటే విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా యువతలో సేవాభావం పెంపొందుతుందని పేర్కొన్నారు.విద్యార్థులకు అవసరమైన టైలు, బెల్టులను అందజేసిన రావుల జైదీప్‌ను గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అభినందించారు. విద్యార్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధుషా ఉపేందర్ రెడ్డి, పాపిరెడ్డి, అనిల్ రెడ్డి, సోమిరెడ్డి, అజిత్ రెడ్డి, మోహన్ రెడ్డి, రామ్మూర్తి, సోమలింగం, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్బితంలో భూ భారతి రీసర్వే అవగాహన సదస్సు

- శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి డిజిటల్ సర్వే
- 90 ఏళ్ల తర్వాత జరుగుతున్న చారిత్రాత్మక భూ సర్వే
- రైతుల హద్దుల నిర్ధారణతో పాటు ప్రతి భూమికీ 'భూధార్' నంబర్
- గ్రామ సభలో కలెక్టర్, తాహసిల్దార్ కీలక వెల్లడి



**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రీసర్వే అవగాహన కార్యక్రమం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ పంచాయతీ ఆవరణలో ఘనంగా నిర్వహించబడింది. ఈ ప్రత్యేక గ్రామ సభకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, తాహసిల్దార్ రాజయ్య ముఖ్య అతిథులుగా హాజరై, డిజిటల్ రీసర్వే ప్రక్రియపై రైతులకు, గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.

**90 ఏళ్ల క్రితం నాటి రికార్డులు.. ఇప్పుడే నూతన సర్వే...**

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. దాదాపు 90 సంవత్సరాల క్రితం మన దగ్గర భూముల సర్వే జరిగిందని, ఆ కాలం నాటి సేత్వార్, కాస్రా మ్యాన్యువల్ రికార్డులు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. గతంలో ఒక్కో సర్వే నంబరులో ఒక్కరే ఉండేవారని, కానీ కాలక్రమేణా భూమి క్రయవిక్రయాలు, వారసత్వ పంపకాల వల్ల ప్రస్తుతం ఒకే సర్వే నంబరులో చాలా మంది భాగస్వాములు ఉన్నారని వివరించారు. ఇప్పటివరకు సరైన భూముల సర్వే జరగకపోవడం వల్లే అనేక వివాదాలు తలెత్తుతున్నాయని, అందుకే ఈ రీసర్వేకు శ్రీకారం చుట్టామని స్పష్టం చేశారు.

**శాటిలైట్ లింక్, లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌తో డిజిటల్ సర్వే...**

ప్రస్తుతం చేపట్టబోయే విలేజ్ డీటెయిల్ సర్వే పూర్తిగా అత్యాధునిక సాంకేతికతతో, డిజిటల్ పద్ధతిలో జరుగుతుందని కలెక్టర్ వివరించారు. భూములను అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ , శాటిలైట్ తో లింక్ చేస్తామని తెలిపారు. పాత తిప్పన్ల స్థానంలో సరి కొత్త డిజిటల్ మ్యాపింగ్ వస్తుందని పేర్కొన్నారు. సర్వేలో భాగంగా గ్రామం మొత్తం బౌండరీని నిర్ధారించడంతో పాటు, గ్రామకంఠం, శ్మశాన వాటికలు, ప్రభుత్వ భూములను స్పష్టంగా గుర్తించి సరిహద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.

**భూమి లేకున్నా పాస్‌బుక్‌లు.. రీసర్వేతో చెక్...**

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో భూమి లేకపోయినా కొంతమందికి పాస్‌బుక్‌లు ఉన్నాయని, ఈ డిజిటల్ సర్వే ద్వారా అలాంటి వాటికి పూర్తిగా చెక్ పడుతుందని అధికారులు స్పష్టం చేశారు. డిజిటల్ సర్వే ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆన్‌లైన్‌లో వివరాలన్నీ నమోదు చేసి, ప్రతి భూమికి ఒక విశిష్టమైన భూధార్ నంబర్‌ను కేటాయిస్తామని వెల్లడించారు. ఆ తర్వాతే అర్హులైన ప్రతి రైతుకు నూతన పాస్‌బుక్ అందజేస్తామన్నారు.

**21 రోజుల్లో అభ్యంతరాలకు అవకాశం....**

డిజిటల్ సర్వే పూర్తయిన తర్వాత ఆ వివరాలను 21 రోజుల పాటు గ్రామ సభ లేదా బులెటిన్ బోర్డులో నోటీసు బోర్డుపై ఉంచుతామని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే రైతులు తెలియజేయవచ్చని అధికారులు సూచించారు. సర్వే బృందాలు గ్రామానికి వచ్చినప్పుడు ప్రతి రైతు స్వయంగా పాల్గొని, తమ భూమి యొక్క సరిహద్దులను చూపెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# సీతమ్మసాగర్–సీతారామ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలి

- ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఉమ్మడి ప్రకటన
- క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన మంత్రుల బృందం
- ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి నెలా సమీక్ష, నిధుల కొరత లేకుండా చర్యలు



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా :**

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందించి, యావత్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం పరిధిలోని సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణ పనులను గురువారం మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుండి పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం, అధికారులతో కలిసి మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధాన ప్రక్రియను సమీక్షించారు.

**ప్రజాధనం వృథా కాకుండా త్వరగా పూర్తి చేస్తాం**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గోదావరి జలాలను గ్రావిటీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గరిష్టంగా వినియోగించుకునేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో రూ.3,500 కోట్ల అంచనాతో ప్రారంభమైన రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులు, తదనంతర పునఃరూపకల్పన వల్ల రూ.24 వేల కోట్లకు చేరాయన్నారు. ఇప్పటికే రూ.7,500 నుండి రూ.8,000 కోట్ల ప్రజాధనం వ్యయమైనందున, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూరుస్తామన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల వ్యవస్థలను సమన్వయం చేస్తూ, ప్రతి నెలా పనుల పురోగతిపై సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.నాణ్యతతో కూడిన సాగునీరే లక్ష్యం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకున్న న్యాయపరమైన చిక్కులను త్వరితగతిన పరిష్కరించి, ఇల్లందు నియోజకవర్గంతో పాటు జిల్లా అంతటా నీరందిస్తామన్నారు. కాళేశ్వరం బ్యారేజీలపై ఎన్ డి ఎస్ ఏ, సి డబ్ల్యూ సి నిపుణుల నివేదికల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో పునరుద్ధరణ చర్యలు చేపడతామన్నారు. అలాగే, రికార్డు స్థాయిలో వరి ధాన్యం కొనుగోలు చేసి రూ.80 వేల కోట్లకు పైగా నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు.

**పనుల కోసం రూ.1,000 కోట్లకు పైగా విడుదల: మంత్రి పొంగులేటి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలక్ట్రికల్, మెకానికల్ పనుల కోసం రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేశామని తెలిపారు. గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలు కాకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామని, అవసరమైతే మరిన్ని అదనపు నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.అధికారుల పర్యవేక్షణ - మారెళ్ళపాడు సందర్శన:

ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అనుసంధానం తదితర అంశాల పురోగతిని జిల్లా కలెక్టర్ అంకిత్ మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రుల బృందం మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకాన్ని కూడా సందర్శించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య,రామదాసు నాయక్,ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

- వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- ఎల్ నినో ప్రభావంతో వర్షా భావ పరిస్థితులు
- చిన్నకల్వలలో రైతులకు అవగాహన కల్పించిన ఏఈఈ సుష్మిత, ఏఈవో ప్రశాంత్

**సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు సాగుపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఏఈఈ సుష్మిత, ఏఈవో ప్రశాంత్ కుమార్ కోరారు. గురువారం మండలంలోని చిన్నకల్వల గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ.. రైతులకు పంటల సాగులో పలు సూచనలు, సలహాలు అందించారు. గతేడాది వానాకాలంలో కురిసిన వర్షపాతం కంటే ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతుందని పేర్కొన్నారు. రైతులు నీటి ఆధారిత పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, వరికి బదులుగా ఆరుతడి పంటలైన ఆయిల్ ఫామ్ పంటలు, పెసర, మినుము, కంది వంటి పంటలు సాగు చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై కంది విత్తనాలు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని వర్షాలు ఆలస్యమైనా లేదా తక్కువ కురిసినా రైతులు ఇబ్బందులు పడకుండా తక్కువ నీటి పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఇరిగేషన్ ఏఈఈ మాట్లాడుతూ.. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల భూగర్భ జలాలు క్షీణిస్తున్నందున ప్రాజెక్టులలో నీటివసతి రోజురోజుకూ తగ్గుతున్నందునా, రైతులు ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని, తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పంటలను సాగు చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొంగోని కుమార్ గౌడ్, పంచాయతీ సెక్రటరీ రణధీర్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు

- డ్రగ్స్ కు యువత దూరంగా ఉండాలి
- నూతన్‌కల్ ఎస్ఐ నాగరాజు



**నూతనకల్ తెలంగాణ చౌరస్తా**

మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి యువత, విద్యార్థులు పూర్తిగా దూరంగా ఉండాలని నూతన్‌కల్ ఎస్ఐ నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం నూతన్‌కల్ మండల కేంద్రంలోని విజయ మేరీ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ, డ్రగ్స్ అలవాటు వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని విద్యార్థులకు వివరించారు. క్షణిక ఆనందం కోసం మాదకద్రవ్యాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి విద్యార్థి డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో భాగస్వామి కావాలని, తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజల్లో కూడా ఈ అంశంపై అవగాహన కల్పించాలని కోరారు.గ్రామంలో లేదా పాఠశాల పరిసరాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తా

- ఇరుగు కిరణ్



**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జిగా నూతనకల్‌కు చెందిన ఇరుగు కిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న (తెలంగాణ వెంకన్న) గురువారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఇరుగు కిరణ్ భవిష్యత్తులో కూడా ఉద్యమకారుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం తమకు ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న కిరణ్ ఉమ్మడి నల్గొండ జిల్లాలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సకల జనుల సమ్మె, సాగర్ హారం, సడక్ బంద్, సంసద్ యాత్ర, మిలియన్ మార్చ్ వంటి ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు.తనపై నమ్మకం ఉంచి సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్నలకు ఇరుగు కిరణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే తండాల అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కూరు రవీంద్రాచారి

**తొర్రూరు -తెలంగాణ చౌరస్తా:**

తండాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని... తండాలను గ్రామపంచాయతీలుగా చేసి గాలికి వదిలేసిన ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వమని.. సామాజిక న్యాయం సమగ్ర అభివృద్ధి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వల్లనే సాధ్యపడుతుందని తొర్రూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కూరి రవీంద్ర చారి అన్నారు. గురువారం మండలంలోని జీకే తండా గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్డుపనులు గ్రామ సర్పంచ్ బానోత్ శీను తో కలిసి రవీంద్ర చారి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేద ప్రజలకు రేషన్ కార్డులు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గాలికి వదిలేసిన ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వమని విమర్శించారు. పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డిల సహకారంతో తొర్రూరు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ కైక, నాయకులు మిత్తింటి హరీష్, వార్డు సభ్యులు రాము, స్వరూప, యాకూబ్, సోనీ, గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలి

- బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా



**రామన్నపేట తెలంగాణ చౌరస్తా**

రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ లో విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నపేటలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించారు. సుభాష్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టిన విద్యార్థులు జీవో నెం.9, ఆర్ఆర్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ మాట్లాడుతూ.. పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి, వృత్తి విద్యా కోర్సులకు పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం నాయకులు అక్కెనపల్లి సైదులు, బీజేపీ కార్యవర్గ సభ్యుడు పల్లపు దుర్గయ్య, టీఎస్ఎస్ఏ నాయకుడు కురెళ్ల మహేష్, బీసీ సంఘం నాయకులు ఎడ్ల మహాలింగం, జినుకల కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సురేష్, మనీష్, అనిత, లింగస్వామి, వినయ్, వెంకట్, భాస్కర్, రమాదేవి, ఉషశ్రీ, ఉదయశ్రీ, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే మెచ్చా గృహ నిర్బంధం
- బిఆర్ఎస్ నాయకుల అరెస్టులు
- ప్రశ్నిస్తే అణచివేతలా...? మెచ్చా నాగేశ్వరరావు గృహ నిర్బంధంపై బిఆర్ఎస్ శ్రేణుల నిరసన
- మంత్రుల పర్యటన వేళ గృహ నిర్బంధాలు
- రైతాంగ సమస్యలపై సమాధానం చెప్పాల్సిందే



**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

నియోజకవర్గంలో అధికార బలాన్ని ఉపయోగించి ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడం హేయమైన చర్య అని అశ్వారావుపేట బిఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. ఈ రోజు మణుగూరులో ఉప ముఖ్యమంత్రితో పాటు నలుగురు మంత్రులు సీతారామ నీటిపారుదల పథకాన్ని సందర్శిస్తున్న నేపథ్యంలో, జిల్లా రైతాంగ పక్షాన నిలబడి వారి సమస్యలపై ప్రశ్నించడానికి బయలుదేరనున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును పోలీసులు తెల్లవారుజామునే గృహ నిర్బంధం చేశారు. అలాగే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు పిలుపు మేరకు మణుగూరు వెళ్లకుండా అశ్వారావుపేట మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ప్రశ్నించే హక్కును కాలరాస్తున్నారు: మెచ్చా నాగేశ్వరరావు పోలీసుల గృహ నిర్బంధంపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మండల బిఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల తరపున అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేకనే ప్రభుత్వం ఇలాంటి ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. అరెస్టులతో తమను ఆపలేరని, జిల్లా రైతాంగం తరపున తాము లేవనెత్తుతున్న ఈ క్రింది ప్రశ్నలకు మంత్రులు ఖచ్చితంగా సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. సాగునీటి అన్యాయం. భద్రాద్రి జిల్లా రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు అన్యాయం చేస్తోంది? సీతారామ పథకం ద్వారా జిల్లాలో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారో నలుగురు మంత్రులు స్పష్టం చేయాలి.పనుల మందగమనం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ ముప్పై ఒక్క నెలల కాలంలో సీతారామ పథకంలో కనీస పనులు కూడా జరగలేదన్నది నిజం కాదా? రైతు భీమా & సహాయం.మరణించిన వంద మంది రైతులకు రైతు భీమా ఎందుకు అందలేదు? వారికి ప్రభుత్వ భీమా ప్రీమియం చెల్లించారా లేదా. రుణమాఫీ , రైతు భరోసా రెండు లక్షల రూపాయల రుణమాఫీ కాని రైతుల వివరాలను, రైతు భరోసా అందని రైతుల వివరాలను తక్షణమే ప్రకటించాలి. ఎన్నికల హామీ ప్రకారం రైతు కూలీలకు ఇస్తామన్న పన్నెండు వేల రూపాయల వార్షిక సహాయం ఎప్పటి నుండి ఇస్తారు?ఎరువుల పంపిణీ లోపాలు. సాంకేతికతను వాడుకోవడం అంటే కేవలం సులభంగా ఆహారాన్ని ఆర్డర్ పెట్టుకోవడం కాదు, రైతులకు కావాల్సిన ఎరువులు నేరుగా పొలాల వద్దకు చేరాలి. నిల్వలు లేనప్పుడు కేవలం సాంకేతిక అనువర్తనాలలో చూపిస్తే ప్రయోజనం ఏమిటి భూముల సమస్యలు. పోడు భూములకు కొత్త పట్టాలు ఇస్తామన్న ఎన్నికల వాగ్దానాలు ఏమయ్యాయి? ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసులకు అసైన్డ్ పట్టాలు ఇచ్చి పూర్తి హక్కులు కల్పిస్తారా లేదా? మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకం .మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకం ద్వారా ఎప్పటిలోగా నీటిని అందిస్తారు? ఈ పైప్‌లైన్ కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఎప్పుడు చెల్లిస్తారు.పామాయిల్ కొనుగోలు కేంద్రం: పామాయిల్ కొనుగోలు కేంద్రాన్ని ఏడూళ్ళ బయ్యారం పరిధిలోనే ప్రారంభించాలి. విద్యుత్ రంగ సమస్యలు. రైతు డిస్కమ్ పేరుతో భద్రాద్రి విద్యుత్ కేంద్రాన్ని ప్రైవేటీకరించే కుట్రలు జరుగుతున్నాయా? రైతులకు ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్ అందకపోవడానికి గల కారణాలను వివరించాలి. వైద్యారోగ్య శాఖ వైఫల్యాలు. గుండాల, పినపాక, రామవరం ప్రాంతాలలో ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ నిర్లక్ష్యం కారణంగా చనిపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించాలి. అలాగే ఇసుక లారీల ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలను ఆదుకోవాలి.


**ప్రజా క్షేత్రంలో పోరాటాలు ఉధృతం చేస్తాం**

ప్రజల పక్షాన బిఆర్ఎస్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చేంతవరకు తమ పోరాటం ఆగదని నాయకులు హెచ్చరించారు. అక్రమ అరెస్టులు తమకు కొత్త కాదని, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ముందస్తు అరెస్టుల పాలైన వారిలో అశ్వారావుపేట మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మండల నాయకులు వెంకన్న బాబు, మందపాటి మోహన్ రెడ్డి, యూఎస్ ప్రకాష్ రావు, సత్యవరపు సంపూర్ణ తదితరులు ఉన్నారు.

# మిషన్ భగీరథ కార్మికుల ధర్నా

- ఏడు నెలలుగా వేతనాలు బకాయిలు విడుదల చేయాలి
- అదనపు జిల్లా కలెక్టర్‌కు కార్మికుల వినతి





**నూతనకల్ తెలంగాణ చౌరస్తా**

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలోని చిల్పకుంట్ల 20 ఎంఎల్డీ మిషన్ భగీరథ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో ప్లాంట్ ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వర్కర్ల ఆధార్ వెరిఫికేషన్ కోసం ప్లాంట్‌కు వచ్చిన అదనపు జిల్లా కలెక్టర్‌కు కార్మికులు తమ సమస్యలను వివరించిన వినతిపత్రాన్ని అందజేశారు.వెంటనే పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలను విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో పాల్గొన్న ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, యూనియన్ అధ్యక్షుడు ఎల్. రమేష్ మాట్లాడుతూ, కార్మికులు పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏజెన్సీ యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కనీస వేతనాల చట్టాన్ని ఉల్లంఘిస్తూ నెలల తరబడి జీతాలు నిలిపివేయడం చట్టవిరుద్ధమని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల చదువులు, కుటుంబ పోషణకు అవసరమైన ఖర్చులు భరించలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో కార్మికుల వేతనాలను నెలకు రూ.30 వేలుగా పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బత్తుల హరికృష్ణతో పాటు గోపాల్, రామకృష్ణ, సత్యనారాయణ, శ్రీకాంత్, సైదులు, కూసుప్పలయ్య, శేఖర్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

# బతికుండగానే.. మరణించినట్లుగా చూపించి

- ఉన్న భూమిని అక్రమంగా వేరే వారి పేరుపైకి పట్టా..
- తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్న బాధితులు




**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**
తాను బతికుండగానే మృతురాలిగా చూపించి తన భూమిని అక్రమంగా వేరే వ్యక్తి పేరుపై వారసత్వ పట్టా చేశారని పాలకుర్తి మండలానికి చెందిన ఓ గిరిజన మహిళ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు బామ్లా నాయక్ తండాకు చెందిన ఇస్లావత్ సుజాత కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన అనంతరం జిల్లా కేంద్రంలోని మీడియాతో మాట్లాడారు. బాధితురాలి కథనం ప్రకారం.. గతంలో ప్రభుత్వం తమ గ్రామంలోని 66 మంది గిరిజన కుటుంబాలకు సర్వే నంబర్ 111లో ఒక్కొక్కరికి 24 గుంటల చొప్పున భూమిని కేటాయించింది. అయితే ఇటీవల రైతు భరోసా నిధులు తన ఖాతాలో జమ కాకపోవడంతో విచారించగా, తన పేరుపై ఉన్న భూమి మరొకరి పేరుపై వారసత్వంగా పట్టా అయినట్లు తెలిసిందని తెలిపిందన్నారు. తాను జీవించి ఉండగానే నకిలీ మరణ ధృవీకరణ పత్రం సృష్టించి భూమిని ఇతరుల పేరుపైకి మార్చారని, ఈ వ్యవహారంలో పాలకుర్తి తహసీల్దార్‌కు పూర్తి సమాచారం ఉన్నప్పటికీ అక్రమ పట్టా చేశారని ఆమె ఆరోపించారు. తన పేరుపై ఉన్న భూమిని తిరిగి తనకే నమోదు చేయాలని, అలాగే అక్రమ పట్టా చేసిన పాలకుర్తి మండల తహసీల్దార్‌పై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇస్లావత్ సుజాత ప్రభుత్వాన్ని కోరారు.



# చినలచ్చి సాయిలు మృతదేహానికి నివాళి

- సర్పంచ్ గర్దాస్ విక్రమ్

**రామన్నపేట తెలంగాణ చౌరస్తా**
రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన చినలచ్చి సాయిలు మృతదేహానికి సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, మందడి విద్యాసాగర్ రెడ్డి, మంటి లింగస్వామి, మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య, రాస వెంకటేష్, రేపాక సత్తయ్య, మాజీ ఉపసర్పంచ్ గర్దాస్ వెంకటేష్, చిన్నపాక శ్రీనివాస్, నక్క వెంకటేష్, కాటేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాగన్న త్యాగం అజరం అమరం

మా మేనత్త కుమారుడు మందుల ఈదయ్య గారు వార్డెన్ గా కల్లూరు, వైరా లో పని చేసినప్పుడు నేను 10 వ తరగతి వరకు అక్కడే పూర్తి చేశాను.వాళ్ళ స్వగ్రామం రాజారం. ఆ గ్రామానికి విప్లవ పోరాట నేపథ్యం ఉంది. ఆ గ్రామానికి మా గ్రామానికి మధ్య బంధుత్వాలు ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన నాగన్న కుమారుడు అజయ్ కూడా మేము చదివే హాస్టల్లోనే మాతో పాటే చదువుకునే వాడు. ఆవిధంగా నాగన్న అజయ్ ను చూడడానికి చాలా అరుదుగా వచ్చే వాడు.అప్పుడే తెలిసింది పాటలు పాడే నాగన్న అయినేనని.ఆవిధంగా నాగన్న ను చూసాను.నాగన్న పేరు ప్రఖ్యాతలు ఉన్న వ్యక్తి. అయిన తన కుమారుడని సాధారణ ప్రభుత్వ హాస్టల్లో చదివించడం ఏమిటని మా స్నేహితులం అనుకునే వాళ్ళం. ఎలాంటి స్వార్థం లేకుండా పేద పిల్లలు చదివే హాస్టల్లో చదివించాడు. తన పలుకుబడిని ఎక్కడ ఉపయోగించకుండా సాధారణ పేద పిల్లల వలే చదివించడం గొప్ప విషయం గా చూడాల్సిన విషయం.

ఖమ్మం జిల్లా విప్లవోద్యమాలకు కేంద్రం.అక్కడ నిరంతరం ఏదో ఒక సమస్యపై పెవిలియన్ గ్రౌండ్ లో సభలు జరుగుతుండేవి. ఆ విధంగా ఒక సభలో మేము పాల్గొన్నాము. ఆసభలో తన జీవిత సహచరి లక్ష్మక్కతోపాటు ఇతర కామ్రేడ్స్ తో వేదిక పైన పాటలు పాడుతూ ఆలాపన చేస్తుంటే ఏదో తెలియని తన్మయత్వం తో మునిగిపోయే వాళ్ళం. నాగన్న పాడిన పాట బాగుందని మేము చెప్పుకునే వాళ్ళం. ఆయన పాడిన పాట నాకు తెలియని ఏదో కొత్త ఆలోచనలకు దారి చూపింది. నాగన్న కష్టాలను , విప్లవ రాజకీయాలను ఇష్టంగా లక్ష్మక్క స్వీకరించడం ఒక భాగం అయితే నాగన్న పాటకు గొంతుకు కోరస్ గా జీవితకాలం కలిసి కొనసాగించింది. తను ఎంచుకున్న ముళ్ళ బాటలో తన కుటుంబాన్ని కూడా భాగస్వామ్యం చేయించడం అదొక గొప్ప విషయం.

ఆట,పాటలనేవి మనిషి ఆహ్లాదానికి ,విలాసం,సరదాల కోసమే కాదు. పీడితులకు కూడా స్పృహ ను కూడా అందిస్తూ పోరు బాటలో సాగనంపుతుంది. అలాంటి పోరాట పాటను నాగన్న ఎంపిక చేసుకున్నాడు. ప్రాథమిక విద్య కూడా పూర్తి చేయని నాగన్న ఈ సమాజంలో మంచి గుర్తింపును పాట ద్వారా పొందాడు. తన పాటలు, రచనలతో విప్లవ రాజకీయ జీవితంలో తన గొంతుకు నిరంతరం మెరుగులు దిద్దుతూ అరుణోదయ నాగన్న గా దేశవ్యాప్తంగా పేరు పొందాడు.



ప్రజల బతుకుల్లో నాగన్న పాట విశేషమైన మార్పును, సమరశీలమైన భావాజాలాన్ని వ్యాప్తి చేసింది .వర్గ చైతన్యాన్ని అందించింది. నెత్తురు మండే యువకులను మరింతగా ప్రభావితం చేసింది. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై తను పాటలు పాడుతుంటే ప్రజల కళ్ళ నుండి ధారల వలే కన్నీటిని కార్చేవారు. ఉత్తేజాన్ని నింపాడు. అనేక మందిని ఆయన పాట మేల్కొలిపింది. గాయకుడి వరకే పరిమితం కాకుండా పార్టీ ఎక్కడికి వెళ్ళమంటే అక్కడికి వెళ్లి పార్టీ బాధ్యతలు నిర్వర్తించాడు. ఎక్కడ గొప్పలకు వెళ్లకుండా సాదా సీదాగా ఉంటూ స్థిరంగా ఉద్యమంలో ఉన్నాడు. ఈ విధంగా సాంస్కృతిక ఉద్యమంలో త్యాగ నిరతినీ ప్రదర్శించి ఎంతోమందికి త్యాగజీవిగా, ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచాడు.

పార్టీ చీలికలకు గురైన అనేక ప్రైవేట్ అవకాశాలు వచ్చిన,ఎన్ని కష్టాలు వచ్చినా, ఆరోగ్యం క్షీణించిన తన పోరాట పదంలో ఎక్కడ తొణికిసాలడకుండ చివరి వరకు విప్లవ స్రవంతిలోనే కొనసాగాడు. పార్టీ ,అరుణోదయ లక్ష్యాలకు ,రాజకీయ ఆలోచనలకు కట్టుబడి ఉక్కు క్రమశిక్షణతో ఉన్నాడు. తన సొంత మండలంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో అనేక అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలు వచ్చిన వెనుకడుగు వేయలేదు. జీవితమే ఉద్యమంగా కొనసాగింది. నాగన్న జీవితం నుండి నేర్చుకోవాల్సింది చాలా ఉంది.

ప్రస్తుతం నాగన్న భౌతికంగా మన మధ్య లేక పోయినా ఆయన పోరాట పాటలు,రచనలు అందించిన స్ఫూర్తితో ఉద్యమించే ప్రజల మధ్య నాగన్న ఎప్పుడు బ్రతికే ఉంటాడు. నాగన్న సాంస్కృతిక ఉద్యమానికి అందించిన కృషిని ఈ శ్రామిక వర్గ ప్రజలు మరవరు. ఆయన నడిచిన ఎర్ర ఎర్ర దారిలోనే మనమందరం కొనసాగుదాం. వర్తమాన కాలంలో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలను నాగన్న స్ఫూర్తితో కొనసాగిద్దాం.పాటల ఆత్మీయున్ని నిరంతరం ప్రజాపోరాటాల్లో స్మరించుకుందాం....



**గంట నాగయ్య**

# అవగాహనే కల్తీకి అసలైన అడ్డుకట్ట

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
నేటి సమాజంలో కల్తీ అనేది కేవలం ఆహార పదార్థాలకే పరిమితం కాలేదు. మనం తినే ఆహారం నుంచి, తాగే నీరు వరకు, వాడే మందుల నుంచి, రోజువారీ వినియోగ వస్తువుల వరకు అనేక రంగాల్లో నాణ్యతలేని ఉత్పత్తులు విస్తరిస్తున్నాయి. ఫలితంగా ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నాయి. నేటి సామాన్యుడు పెరుగుతున్న ధరలతో ఇప్పటికే కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నాడు. సంపాదన తక్కువ, ఖర్చులు ఎక్కువ. అలాంటి పరిస్థితుల్లో "తక్కువ ధరకు వస్తే చాలు" అనే ఆలోచనతో వస్తువులను కొనుగోలు చేస్తున్నాడు. కానీ తక్కువ ధర కోసం తీసుకున్న ఆ నిర్ణయమే కొన్నిసార్లు జీవితాంతం బాధను మిగులుస్తోంది. ఆహారంలో నాణ్యత లేకపోవడం వల్ల చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక రకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. కల్తీ పాలు, నూనెలు, మసాలా దినుసులు, తీపి పదార్థాలు, పండ్లు, కూరగాయలు, తేనె వంటి అనేక ఆహార పదార్థాల్లో కల్తీ పెరుగుతోంది. ఇవి శరీరంలో నెమ్మదిగా విషంలా పనిచేసి మధుమేహం, గుండెజబ్బులు, కాలేయ సమస్యలు, మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. ఆరోగ్యం క్షీణించిన తర్వాత సామాన్యుడు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ తన సంపాదించిన డబ్బును వైద్య ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోంది. చికిత్స కోసం విలువైన సమయం, శ్రమ, డబ్బు అన్నీ కోల్పోతున్నాడు. చివరికి తక్కువ ధరకు కొన్న వస్తువు వల్ల ఎక్కువ నష్టాన్ని చవిచూస్తున్నాడు. ఆహార పదార్థాలే కాదు, గృహోపకరణాలు, విద్యుత్ పరికరాలు, ప్లాస్టిక్ వస్తువులు, దుస్తులు, బొమ్మలు, సౌందర్య సాధనాలు, నిర్మాణ సామగ్రి వంటి అనేక వస్తువులు కూడా నాణ్యత లేకుండా మార్కెట్లోకి వస్తున్నాయి. ఇవి కొద్ది రోజుల్లోనే పాడై చెత్తగా మారిపోతాయి. దీంతో వినియోగదారుడు మళ్లీ కొత్త వస్తువులు కొనాల్సి వస్తుంది. ఇది వ్యక్తిగత ఆర్థిక నష్టమే కాకుండా, పర్యావరణ కాలుష్యాన్ని కూడా పెంచుతోంది. ప్రజల ఆర్థిక బలహీనతను కొందరు వ్యాపారులు అవకాశంగా మలుచుకుంటున్నారు. నాణ్యత లేని ముడి పదార్థాలతో వస్తువులు తయారు చేసి, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో మార్కెట్లో విక్రయిస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. కొందరు నకిలీ బ్రాండ్ పేర్లతో ప్రజలను మోసం చేస్తున్నారు. నిజాయితీగా వ్యాపారం చేసే వారు నష్టపోతుండగా, అక్రమంగా సంపాదించే వారికి అవకాశాలు పెరుగుతున్నాయి. కల్తీని పూర్తిగా అరికట్టడం కష్టమే కావచ్చు. కానీ కఠినమైన చట్టాల అమలు, నిరంతర తనిఖీలు, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించే విధానం, నేరస్థులకు వేగవంతమైన శిక్షలు ఉంటే పరిస్థితిలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చు. అలాగే వినియోగదారుల్లో అవగాహన పెరగడం కూడా అత్యంత అవసరం. ప్రజలు కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. కొనుగోలు చేసే వస్తువుల తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత గుర్తులు, తయారీదారు వివరాలు పరిశీలించాలి. అనుమానాస్పదమైన వస్తువులను కొనకుండా ఉండాలి. బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. కల్తీ లేదా నాణ్యతలేని వస్తువులు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి. ప్రభుత్వ శాఖలు, ఆహార భద్రత అధికారులు, వినియోగదారుల సంఘాలు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కల్తీ ఉత్పత్తులను కొంతవరకైనా అరికట్టాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. అందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఎవరైనా ఆహార పదార్థాలు, మందులు లేదా ఇతర వస్తువుల నాణ్యతపై అనుమానం వ్యక్తం చేస్తే, వెంటనే ఆ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉండాలి. ఆ యాప్‌లో వస్తువు ఫొటోలు, వీడియోలు, కొనుగోలు చేసిన బిల్లు, దుకాణం పేరు, చిరునామా, కొనుగోలు చేసిన తేదీ, లొకేషన్ వంటి వివరాలను నమోదు చేసే సౌకర్యం కల్పించాలి. ఫిర్యాదు నమోదు అయిన వెంటనే అది సంబంధిత ఆహార భద్రత, వినియోగదారుల పరిరక్షణ లేదా ఇతర తనిఖీ అధికారులకు చేరేలా వ్యవస్థ రూపొందించాలి. ప్రతి ఫిర్యాదుకు ఒక ప్రత్యేక ట్రాకింగ్ నంబర్ ఇచ్చి, దాని పురోగతిని ఫిర్యాదు చేసిన వ్యక్తి యాప్‌లోనే తెలుసుకునే అవకాశం కల్పించాలి. ఫిర్యాదు నిజమని తేలితే సంబంధిత వ్యాపార సంస్థపై వెంటనే తనిఖీలు నిర్వహించి, అవసరమైతే వస్తువులను స్వాధీనం చేసుకోవడం, భారీ జరిమానాలు విధించడం, లైసెన్స్ రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా, ఒకే దుకాణం లేదా తయారీ సంస్థపై పదేపదే ఫిర్యాదులు వస్తే వాటిని ప్రత్యేకంగా గుర్తించి కఠిన పర్యవేక్షణలో ఉంచాలి. తప్పుడు ఫిర్యాదులు తగ్గించేందుకు ఆధారాలతో కూడిన ఫిర్యాదులకే ప్రాధాన్యత ఇవ్వాలి. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ ప్రభుత్వం, అధికారులు, ప్రజలు కలిసి పనిచేస్తే కల్తీ ఉత్పత్తులపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యమవుతుంది. ప్రజల అప్రమత్తతకు సాంకేతికత తోడైతేనే కల్తీ రహిత సమాజ నిర్మాణం వేగవంతమవుతుంది. పాఠశాల స్థాయి నుంచే నాణ్యమైన ఉత్పత్తులను గుర్తించే విద్యను అందించాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; వ్యాపారులు, తయారీదారులు, వినియోగదారులు అందరి సామాజిక బాధ్యత. నాణ్యతను ఎంచుకోవడం ఖర్చు కాదు అనే విషయాన్ని ప్రతి వినియోగదారుడు గుర్తించాలి, మీ నాణ్యమైనవి వాడడం అనేది మీ ఆరోగ్యంపై పెట్టుబడి అవుతుంది. తక్కువ ధరకు మోసపోవద్దు, నాణ్యమైన వస్తువులను ఎంచుకుని ఆరోగ్యాన్ని, డబ్బును, భవిష్యత్తును కాపాడుకుందాం. కల్తీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తిద్దాం.





**డాక్టర్. వై. సంజీవ కుమార్,**
ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్
9393613555,
9493613555

# ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- వ్యవసాయ అధికారి సూచనలు

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**
మద్దూర్ మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ గురువారం మండలంలోని దమగన్‌పూర్ మరియు హమ్యా నాయక్ తండా గ్రామాలను సందర్శించి రైతులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడే వర్షాభావం,అధిక ఉష్ణోగ్రతలు మరియు పంటలపై పడే ప్రభావాల గురించి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.వ్యవసాయ అధికారి మాట్లాడుతూ,ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం అసమానంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా వరి,పత్తి మరియు కంది పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు.వరి పంటలో నర్సరీలను నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలి.వర్షపాతం పరిస్థితులను బట్టి సరైన సమయంలో నాట్లు వేయాలి.పొలంలో అవసరానికి మించి నీటిని నిల్వ ఉంచకుండా,తడి-పొడి (Alternate Wetting and Drying) పద్ధతిని అనుసరించాలి.నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేయాలి.తెగుళ్లు, పురుగుల ఉధృతి కనిపించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలి.అధిక ఉష్ణోగ్రతల సమయంలో పంటపై ఒత్తిడి తగ్గేలా తగిన నీటి యాజమాన్యాన్ని పాటించాలి. అలాగే పత్తి పంటలో వర్షాల పరిస్థితులకు అనుగుణంగా సిఫార్సు చేసిన విత్తన రకాలను మాత్రమే ఉపయోగించాలి.సకాలంలో విత్తనం పూర్తి చేయాలి. మొక్కల మధ్య తగిన దూరం పాటించడం ద్వారా గాలి ప్రసరణ మెరుగుపడి తెగుళ్లను తగ్గించవచ్చు. తెల్లదోమ,పచ్చదోమ,తామర పురుగులు మరియు గులాబీ రంగు కాయతొలుచు పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఫెరోమోన్ ట్రాప్స్ ఏర్పాటు చేయాలి.సమగ్ర పురుగు నివారణ పద్ధతులను అనుసరించి అవసరమైనప్పుడు మాత్రమే పురుగుమందులను వినియోగించాలి.వర్షాభావ పరిస్థితుల్లో నేలలో తేమను నిల్వ ఉంచేందుకు కలుపు నియంత్రణ,అంతరకృషి చేపట్టాలి.కంది (రెడ్‌గ్రామ్) పంటలో వర్షాలు ప్రారంభమైన వెంటనే విత్తనాలు విత్తాలి.విత్తన శుద్ధి చేసి మాత్రమే విత్తనాలు వినియోగించాలి.నేలలో తేమను నిల్వ ఉంచే విధంగా సంరక్షణ చర్యలు చేపట్టాలి.మొక్కల పెరుగుదల దశలో అవసరమైన ఎరువులను సిఫార్సు మేరకు వేయాలి.కాయ తొలిచే పురుగు,మరుక వ్యాధులు కనిపించిన వెంటనే శాస్త్రీయ పద్ధతుల్లో నివారణ చర్యలు చేపట్టాలి.వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో ఎక్కువ ప్రయోజనం పొందే యాజమాన్య పద్ధతుల జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.అదే విధంగా రైతులకు పంటలపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని,వాతావరణ శాఖ సూచనలను అనుసరిస్తూ వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సాంకేతిక సూచనలు,పంటల నిర్వహణ పద్ధతులు మరియు రైతు వేదికల ద్వారా అందించే సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు లేదా పంటల సమస్యలు ఎదురైతే వెంటనే సమీప వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ గ్రామ సందర్శన సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని,ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించారు. రైతులు కూడా వ్యవసాయ అధికారి సూచనలను ఆసక్తిగా విని,శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరిస్తామని తెలిపారు.



# జోరుగా ఓటర్ల నమోదు

- అవగాహన కల్పించిన కౌన్సిలర్లు
- అర్హులైన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి
- మున్సిపల్ కౌన్సిలర్ల పిలుపు
- గోగులభంధంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు



**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**
అశ్వారావుపేట పురపాలక సంఘం (మున్సిపాలిటీ) పరిధిలో ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు చేపట్టిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా గురువారం గోగులభంధం ప్రాంతంలో ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకురాలు డాక్టర్ బి. ఉదయజ్యోతి, 17వ వార్డు బీజేపీ కౌన్సిలర్ పమిడి గీతాశ్రీ పాల్గొన్నారు. స్థానిక ప్రజలకు ఓటర్ల నమోదు ప్రక్రియపై వారు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల (బూత్) సంఖ్యలు 158, 159, 160, 161 పరిధిలోని అర్హులైన ఓటర్లందరూ తమ ఓటర్ల నమోదు దరఖాస్తు పత్రాలను పూర్తి చేసి, నిర్ణీత సమయానికి నమోదు ప్రక్రియను ముగించుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలి.ఇప్పటివరకు ఓటర్ల నమోదు దరఖాస్తు పత్రాలు తీసుకోని వారు ఎవరైనా ఉంటే, వెంటనే తమ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులను లేదా సంబంధిత బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓ) సంప్రదించి పత్రాలు పొందాలని సూచించారు. ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.